
చేపల చెరువులో తేలియాడుతున్న కోళ్ల వ్యర్థాలు

ఆ నీరు తాగితే ఇంకేమైనా ఉందా?

గుండ్లకమ్మ ప్రవాహ ప్రాంతంలో చేపల పెంపకం

- ఆహారంగా కోడి వ్యర్థాలు
- కొళాయిల్లో రంగుమారిన నీరు... కుళ్లుడు వాసన
- రోగాల భయంలో ఒంగోలు నగర ప్రజలు
- పట్టించుకోని అధికారులు

7

మోసగాళ్ల ఆటకట్టు!

- ఎన్ఆర్ఐలకు అధిక వడ్డీ ఆశ చూపి టోకరా
- ఒంగోలులో ఎరవేసి పట్టుకున్న పోలీసులు

వివరాలు మెయిన్‌లో..

సరికొత్త సంకటం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మరిన్ని తిప్పలు



ఒంగోలు ట్రిపుల్ ఐటీకి మూడు క్యాంపస్‌లు

ఒంగోలు ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) విద్యార్థులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూడు కేంద్రాల్లో తరగతులు నిర్వహించనున్నారు. పిల్లి కాపురం మాదిరిగా అక్కడో సంవత్సరం, ఇక్కడో రెండు సంవత్సరాలు, మరోచోట మూడు సంవత్సరాలు వీరికి తరగతులు నిర్వహించనున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందే విద్యార్థులకు మొదట నూజివీడులో తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్ మూసివేతతో ఈ సంకటం తలెత్తింది.

- కొత్త విద్యార్థులకు నూజివీడులో తరగతులు
- 'రావ్ అండ్ నాయుడు' క్యాంపస్ మూత
- సొంత భవనాలు నిర్మించకపోవడంతోనే కష్టాలు



ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదేళ్ల క్రితం ఆవిర్భవించిన ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఇప్పటివరకు సొంత భవనాలు సమకూరలేదు. గత వైసీపీ పాలనలో ఐదేళ్లు శాశ్వత భవనాలు నిర్మించాలన్న ఆలోచన కూడా చేయలేదు. కనీసం అవసరమైన స్థలాన్ని కూడా ఖరారు చేయలేదు. ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీ, ఒంగోలులోని రెండు అద్దె భవనాల్లో ఇప్పటివరకూ తరగతులు నిర్వహిస్తూ

మిగతా 6వ పేజీలో

ఒంగోలులో అద్దెకు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్న రావ్‌అండ్ నాయుడు ఇంజనీరింగ్ కళాశాలలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూసివేయాలని నిర్ణయించారు. కళాశాల అద్దె అగ్రిమెంట్ వచ్చే సెప్టెంబరు 25కు

రావ్ అండ్ నాయుడు క్యాంపస్ మూత

ముగుస్తుంది. ఈ కళాశాలలో ట్రిపుల్ ఐటీ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించడంతోపాటు వసతి కూడా కల్పిస్తున్నారు. కళాశాలలో నీటి కోసం గతంలో విద్యార్థులు పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. ప్రతిరోజూ మునిసిపాలిటీ రెండు ట్యాంకర్లు పంపుతోంది. కళాశాలలో 1,400 మంది విద్యార్థులకు ఈ నీరు సరిపోకపోవడంతో ప్రతిరోజూ రూ.7వేలు ఖర్చుపెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలిస్తున్నారు. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేయడంతో ఒప్పందం చేసుకున్న గడువుకన్నా నాలుగు నెలలు ముందుగానే భవనాలను ఖాళీచేసి క్యాంపస్‌ను మూసివేయాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆ క్యాంపస్‌లోని విద్యార్థులు ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలకు షిఫ్ట్ అయ్యారు. తమ సామాన్లు అక్కడ భద్రపర్చుకొని సెలవులకు వెళ్లారు. సెలవులు పూర్తికాగానే ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో తరగతులకు హాజరవుతారు.



టీచర్ల సంఘాలతో చర్చలు సఫలం

- నేటి డీఈవో కార్యాలయ ముట్టడి వాయిదా
- ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల కేటాయింపు, బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడిని తాత్కాలికంగా వాయిదా వేశారు. మొత్తం 15 డిమాండ్లతో టీచర్ల సంఘాలు సోమ, మంగళవారాలు విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో చర్చలు నిర్వహించగా మెజారిటీ డిమాండ్లకు అధికారుల స్థాయిలోనే పరిష్కారం లభించింది. టీచర్ల బదిలీలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రకటించిన అధికారులు.. ఐక్యవేదిక నాయకుల డిమాండ్ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను మాత్రం మాన్యువల్‌గా చేపట్టేందుకు అంగీకరించారు. ప్రభుత్వానికి, నాయకుల మధ్య అంగీకారం కుదరడంతో బుధవారం బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు.

ఆమోదించిన డిమాండ్లు ఇవీ...

- రేషనలైజేషన్‌లో సీనియర్ టీచర్ తప్పనిసరి అయితే రేషనలైజేషన్ పాయింట్లు ఇస్తారు.
- హైస్కూళ్లలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్ ఇస్తారు
- పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు
- ఉన్నత పాఠశాలల్లోని ప్రాథమిక పాఠశాలలను వేరుగానే పరిగణిస్తారు.
- హైస్కూళ్లలో వారానికి 32 పీరియడ్ల పనిభారం

మిగతా 6వ పేజీలో

రాజంపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

దర్శి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజంపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దయింది. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు విచారణలో తేలడంతో జిల్లా పంచాయతీ అధికారి ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజంపల్లి పంచాయతీలో నిధులను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కనిగిరి డీఎల్‌పీవో హనుమంతరావు విచారణ చేపట్టి రూ.29.47 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ డ్రా చేసుకున్నట్లు జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చారు. కొన్ని పనులకు సంబంధించి చేసిన వారికి బిల్లులు ఇవ్వకుండా తన కుమారుడి ఖాతాలోకి నిధులు మళ్లించినట్లు డీఎల్‌పీవో పేర్కొన్నారు. దీంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు ఇచ్చినట్లు ఈవోఆర్డీ సుధాకర్ తెలిపారు.


ఒంగోలులో దట్టంగా కమ్ముకున్న మేఘాలు

తెరపిచ్చిన వర్షం

- మూడు రోజుల్లో 21.0 మి.మీ సగటు వర్షపాతం
- తూర్పు, దక్షిణ ప్రాంతంలో భారీగానే కురిసిన వాన
- సగం పంచాయతీల్లో నిలిచిన ఉపాధి పనులు

ఒంగోలు, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడు రోజులపాటు కురిసిన వర్షం మంగళవారం తెరపి ఇచ్చింది. వారం రోజులుగా అక్కడక్కడా అడపాదడపా జల్లులు పడుతుండగా శుక్రవారం రాత్రి నుంచి ఒక మోస్తరు నుంచి భారీగానే వాన కురిసింది. తూర్పు, దక్షిణ ప్రాంతంలో ప్రభావం అధికంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మూడు రోజుల వ్యవధిలో 21.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఒంగోలు, కొత్తపట్నం, కొండపి, సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి, సంతనూతలపాడు, చీమకుర్తిలలో భారీవర్షం కురిసింది. దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లోని పలుచోట్ల ఒక మోస్తరుగా పడింది. తూర్పు, దక్షిణ ప్రాంతంలో మంగళవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో అధికంగానే వర్షం కురిసింది. జిల్లాలో ఈ సమయంలో సగటున 7.0 మి.మీ వర్షపాతం నమోదైంది. కొండపి మండలంలో 52.8, కొత్తపట్నంలో 32.6, జరుగుమల్లిలో 17.20, ఎస్ఎన్‌పాడులో 16.4, తాళ్లూరులో 14.8, ఒంగోలులో 14.8, పొన్నలూరులో 13.4, ఎన్‌జీపాడులో 13.0, మద్దిపాడులో 11.8, సింగరాయకొండలో 11.60 మి.మీ కురిసింది.

చల్లబడిన వాతావరణం

ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఈ మూడు రోజుల్లో భారీ వర్షమే పడింది. అది కూడా ముసురు పట్టి కురవడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. అయితే మంగళవారం పగటిపూట వర్షం తెరపివ్వడంతోపాటు రోజంతా మబ్బులు పట్టి ఉన్నాయి. దీంతో వర్షం లేకుండా వాతావరణం చల్లగా ఉండటంతో ప్రజానీకం ఊరట చెందింది. రోజువారీ పనులు సాఫీగా సాగాయి. అయితే ముమ్మరంగా సాగుతున్న ఉపాధి హామీ పథకం పనులకు మాత్రం తీవ్ర ఆటంకం కలిగింది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీల్లో రోజువారీ 2.20 లక్షల మంది కూలీలు పనులకు వస్తుండగా మూడు రోజులు ముసురుపట్టిన వర్షాలతో పనులు ఆగాయి. మంగళవారం కూడా జిల్లాలో ఇంచుమించు సగం పంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి. అధికారవర్గాల సమాచారం ప్రకారం జిల్లాలో మంగళవారం 384 పంచాయతీల్లో లక్షా 14వేల మంది మాత్రమే కూలీలు హాజరు కాగా 345 పంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి.

మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలు

పలు కమిటీల్లో జిల్లా నేతలకు స్థానం

మంత్రి స్వామి కన్వీనర్‌గా రక్తదాన, మెడికల్ క్యాంపు కమిటీ

ఒంగోలు మే 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మహానాడు నిర్వహణలో జిల్లాకు చెందిన పలువురు నేతలకు కీలక బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు కడప నగర శివారులో మహానాడు జరగనుంది. దానిని భారీగా నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించి తదనుగుణ ఏర్పాట్లు అధిష్ఠానం పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈక్రమంలో మహానాడు విజయవంతం కోసం 19 కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలను నియమించారు. అందులో పలు కమిటీల్లో జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు ఉన్నారు. ఒక్కో కమిటీకి ఒక రాష్ట్ర స్థాయి ముఖ్య నేత కన్వీనర్‌గా, అవసరాన్ని బట్టి ఒకరిద్దరు కోకన్వీనర్‌లుగా.. పలువురు నాయకులను సభ్యులుగా నియమించారు. అందులో వైద్యులు ప్రధానంగా నడిపించే రక్తదాన, మెడికల్

మిగతా 6వ పేజీలో

23న ఒంగోలులో టీడీపీ జిల్లా మహానాడు

ఒంగోలు కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జిల్లా మహానాడును ఈనెల 23న ఒంగోలులోని త్రోవగుంట సమీపంలో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే మహానాడుకు ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు జిల్లాకి చెందిన మంత్రి, ఒంగోలు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, అనుబంధ సంఘాల ఛైర్మన్లు, డైరెక్టర్‌లు హాజరవుతారన్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాలాజీ కోరారు.



జై జవాన్..

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా గిద్దలూరులో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనికులతోపాటు పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు. జై జవాన్.. జై సిందూర్ అంటూ నినాదాలు చేశారు. త్రివిధ దళాల విజయాన్ని కొనియాడారు.

7




కలెక్టరేట్‌లో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ తదితరులు

ఆదర్శనీయులు ప్రకాశం పంతులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. ఆంధ్రకేసరి 68వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ అన్సారియా, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశాభివృద్ధిలోనూ ప్రకాశం పంతులు ఎంతో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషిచేద్దామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ధైర్య సాహసాలకు ప్రతీక ప్రకాశం పంతులు అని అన్నారు. రాజకీయాలలో ఆయన నెలకొల్పిన విలువలు ఆదర్శనీయమని తెలిపారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నా దానిని త్యాగం చేసి దేశం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశం పంతులు అని కీర్తించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యాశాఖలో బదిలీలు ప్రారంభం

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పని సరిగాబదిలీ అయ్యే వారు, అభ్యర్థన బదిలీ కోరుకోనే వారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సర్‌ప్లస్ అయిన ప్రీపరేషనల్ కేటగిరి కింద దరఖాస్తు చేసే వారు ఎవరైనా ఇంతకు ముందు మెడికల్ బోర్డులో మెడికల్‌చెకప్‌కు హాజరు కాని వారు ప్రస్తుతం మరలా వెళ్ళి మెడికల్ సర్టిఫికెట్లు పొందాలని డీఈవో కోరారు.

ఐసెట్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ పరీక్షా ఫలితాల్లో బాలుర కంటే బాలికలు స్వల్పంగా పైచేయి సాధించారు. జిల్లాలో 93.85శాతం మంది అభ్యర్థులు ఐసెట్‌లో ప్రవేశాలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయిలో 95.86శాతం మంది అర్హత సాధించగా జిల్లాలో 2శాతం తక్కువగా ఉంది. జిల్లాలో 1,496 మంది అభ్యర్థులు పరీక్షకుహాజరు కాగా 1404 మంది అర్హత సాధించారు. వీరిలో బాలురు 734 మందికి 687, బాలికలు 762 మందికి 717 మంది ప్రవేశానికి క్వాలిఫై అయ్యారు. బాలురకంటే బాలికలు 0.50వాతం అధికంగా ఉండగా ఒంగోలులో పరీక్షకు 1,229 మంది హాజరు కాగా 253 మంది అర్హత సాధించారు

భూసేకరణను వేగవంతం చేయాలి

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లానుంచి వెళ్తున్న ప్రధాన రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం జేసీ ఆర్.గోపాలకృష్ణతో కలిసి భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. 565, 544(డి), 167(బి), 765, 544(జీ) జాతీయ రహదారులు, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే మార్గాల నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, నిధుల చెల్లింపు, వివాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటి పురోగతిపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం, పునరావాస కేంద్రాల ఏర్పాటు, నిధులు చెల్లింపులపై సమీక్షించారు. కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణపై చర్చించారు. పాదర్తి, గుండాయపాలెం, పిన్నివారిపాలెం తదితర గ్రామాల్లో భూముల లభ్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అవసరాన్ని బట్టి భూసేకరణపై ఒక స్పష్టత తీసుకోవాలని కలెక్టర్ నిర్ణయించారు. సమావేశంలో డీఆర్వో చినఓబులేషు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్‌త్రివినాథ్, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, వెంకటశివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీకలెక్టర్లు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పంతంగి శ్రీనివాసరావు, పంతంగి ఏడుకొండలు మోటార్‌సైకిల్‌పై ఒంగోలు వెళ్లి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా టిప్పర్ అడ్డు వచ్చింది. దీంతో మోటార్‌సైకిల్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో వారి ఇరువురకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రూఫ్ టాప్ సోలార్‌పై అవగాహన కల్పించాలి

బల్లికురవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : గృహాలలో రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రధాన మంత్రి సూర్యఘర్ మఫ్ట్ బిజ్లీ యోజనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సోలార్‌ను ఏర్పాటు చేసేలా రాయితీలు ఇస్తోందని, అలానే ప్రజలకు బ్యాంకు ద్వారా రుణాలను కూడా ఇస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ మూడు వందల యూనిట్ల విద్యుత్‌ను తయారు చేసేలా ఈ పథకం పని చేస్తుందని తెలిపారు.

దర్శికి చేరిన విదుశేఖర భారతీ విజయ యాత్ర

జగద్గురు విదుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్ర మంగళవారం రాత్రి దర్శికి చేరుకుంది. దర్శి రామాలయం అర్చకులు కలవకొలను చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక గడియారస్తంభం సెంటర్‌కు స్వామీజీ చేరుకోగానే పెద్దఎత్తున భక్తులు స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతో వేద మంత్రాలతో స్వాగతం ఇచ్చారు. మహిళలు అధికసంఖ్యలో బారులు తీరి స్వామివారికి హారతులు ఇచ్చారు. స్వామివారు అక్కడ నుంచి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు.

- దర్శి, ఆంధ్రజ్యోతి



విదుశేఖర భారతీ మహాస్వామి



విదుశేఖర భారతీ మహాస్వామికి హారతులిచ్చేందుకు బారులు తీరిన మహిళలు

అటు మద్రాసోళ్లు.. ఇటు లైసెన్స్ లేనోళ్లు!

- చీరాల సముద్ర తీరంలో నిషేధ కాలంలో అక్రమంగా చేపల వేట
- భవిష్యత్తులో మత్స్య సంపద వృద్ధికి శరాఘాతం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- చర్యలు తీసుకోవాలని వినతులు



వాడరేవు సముద్రతీరం

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం తీరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మత్స్య సంపద వృద్ధి చెందే సమయం కావడంతో ఈ సమయంలో మత్స్యకారులు వేటను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. జిల్లాలో సుమారు 75 కిలోమీటర్లు తీరం ఉండగా, అందులో వేట సాగిస్తూ జీవనం గడుపుతున్న మత్స్యకార కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి.

సుమారు 40 మంది అనధికార వేట

మత్స్య సంపద వేటతో జీవనాధారం సాగిస్తున్న వారి పరిస్థితి ప్రస్తుతం అయోమయంలో పడింది. అప్పుడప్పుడు అకస్మాత్తుగా మద్రాసీయులకు చెందిన ట్రావెలర్ బోట్లు ఆంధ్రా పరిధిలోని తీరంలో అనధికారంగా చొరబడి వేట సాగిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో గుర్తించి నిలదీసిన మత్స్యకారులపై దాడులకు పాల్పడటమే కాకుండా వలల కూడా లాక్కెళ్లిన ఉదంతాలు తెలిసిందే. దీంతో స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు ఇటీవల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి అందజేశారు. ఈనేపథ్యంలో హోం మంత్రి విషయాన్ని సంబంధిత అధికారులకు సూచనలు కూడా చేశారు. తాజాగా స్థానికంగా లైసెన్స్‌లు లేని మోటారు బోటు మత్స్యకారులు సైతం తామేం తక్కువ కాదంటూ ఇష్టారీతిగా తీరంలోకి చొరబడి అక్రమంగా వేట సాగిస్తున్నారు. ఈ తరహా బోట్లు సుమారు 40 మంది తీరంలోకి వెళుతున్నట్లు సమాచారం. అసలే సంధి కాలం, పైగా అనధికార బోట్లు.. అయినా కూడా విచ్చలవిడిగా వేట సాగిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకార సంఘాల నాయకులు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అనధికార వేటను గుర్తించారు. వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఇలా అక్రమంగా చేపల వేట వల్ల సముద్రంలో మత్స్య సంపద వృద్ధికి పెనుముప్పు వాటిల్లింది.



మద్రాసీయులు అనధికారంగా పరిధి దాటి వేట(ఫైల్)

తనిఖీలు నామమాత్రమే

ఫిర్యాదులు చేస్తేనే అధికారులు తనిఖీలకు వస్తున్నారు గానీ, పర్యవేక్షణలోపం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వేట సంధికాలం నుంచి వేట సాగిస్తున్నా అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విమర్శలు ఉన్నాయి. ఈ విధంగా మద్రాసీయులు ఒకవైపు, అనధికార లైసెన్సీయులు మరోవైపు వేట సాగిస్తే సంపద వృద్ధి చెందక భవిష్యత్తులో వేట సాగక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని మత్స్యకారులు విలపిస్తున్నారు.



రవాణాదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు

గ్రానైట్ రవాణాలో నిబంధనలు పాటించాలి

● సీఐ సుబ్బారావు

చీమకుర్తి, మే20(ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ రాళ్లను నిబంధనల మేరకు రవాణా చేయాలని సీఐ సుబ్బారావు తెలిపారు. మంగళవారం చీమకుర్తిలో గ్రానైట్ రవాణా చేసే రవాణాదారులు, డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఓవర్‌లోడుతో రవాణాచేసే క్రమంలో రాళ్లు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల నిబంధనలు పాటించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా రాళ్లను రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.





లాయరుపేటలోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద అధ్వాన్నంగా పారిశుధ్యం

ఆంధ్రకేసరిని పట్టించుకోరా?

ఉమ్మడి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, జిల్లాకు చెందిన టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతి రోజున ఆయన విగ్రహానికి అవమానం ఎదురైంది. మంగళవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన ఆంధ్రకేసరి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలకు అలంకరణలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయితే ఒంగోలు నగరం లాయరుపేటలోని టంగుటూరు ప్రకాశంపంతులు విగ్రహం వద్ద అధికారపూర్వకంగా కనీస పారిశుధ్య పనులు కూడా చేపట్టకపోగా, విగ్రహానికి ఎలాంటి పూలాభిషేకాలు నిర్వహించకపోవడంపై ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సహజంగా మహనీయుల వర్ధంతి కార్యక్రమం సమయంలో అక్కడ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అలంకరణలు చేయడంతోపాటు నివాళుల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అయితే లాయరుపేటలోని విగ్రహం వద్ద పారిశుధ్యం లోపించడంతోపాటు వ్యర్థాలు, టీ గ్లాసులు తదితరాలు అలాగే ఉండటం చూసిన పలువురు కార్పొరేషన్ నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

108 కలశాల జలంతో అభిషేకం





కలశాలతో దేవాలయం వద్ద ప్రదక్షణ చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, మహిళలు, రాతి మండపం దాతలను సత్కరిస్తున్న ఈవో, పూజారులు

- శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం విమాన శిఖరానికి పూజలు
- రాతి మండపం నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలకు సత్కారం

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం విమాన శిఖరానికి మంగళవారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. సోమవారం మహాకుంభాభిషేకం జరగగా మంగళవారం ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు 108 మంది మహిళలతో కలిసి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. అనంతరం విమాన శిఖరానికి అభిషేకంచేశారు. కలశయాత్రలో పాల్గొన్న పలువురు మహిళలు మంగళవారం విమాన శిఖరం జలాభిషేకంలో పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రాతి మండపం నిర్మాణానికి సుమారు 130 మంది లక్ష రూపాయలకు పైగా విరాళాలు అందజేయగా మంగళవారం 70 మంది దాతల కుటుంబాలకు స్వామి దేవాలయంలో ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహింపచేసి అనంతరం సత్కరించి, స్వామి ఫొటో అందజేశారు. మహాకుంభాభిషేకం పూర్తయిన తరువాత మొదటి మంగళవారం కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి

యద్దనపూడి/మార్టూరు మే 20 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో మేడిశెట్టి సుబ్బాయమ్మ(60) అనే మహిళ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి భర్త యలమంద, ఒక కుమారుడు రాంబాబు ఉన్నారు. ఆమె భర్త, కుమారుడు, కోడలుతో కలిసి యనమదల గ్రామంలో ఒక రైస్ మిల్లును నడుపుతున్నారు. అదేవిధంగా ఉదయం మిల్లు నుంచి బయటకు వచ్చిన ఆమె కాలకృత్యాలకు ఒక ఇంటి ప్రహరీ పక్క నుంచి వెళుతూ అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా విద్యుత్ రావడంతో షాక్‌కు గురై అక్కడకక్కడే చనిపోయింది. ఈ ప్రమాదంపై కుమారుడు రాంబాబు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రత్నకుమారి సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాస్తవంగా యద్దనపూడి మండలం కటావారిపాలేనికి చెందిన సుబ్బాయమ్మ కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం యనమదల గ్రామానికి వచ్చి ఒక రైస్‌మిల్లును అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో వ్యక్తి బలవన్మరణం

వేటపాలెం/చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట టైలర్స్ కాలనీలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకు చెందిన బాలకృష్ణ(40) అప్పుడప్పుడు సోడా బండి నిర్వహిస్తూ ఈపూరుపాలెంలో ఓ టిఫిన్ హోటల్లో పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య ధనలక్ష్మీ ఇరువురు కుమారులు ఉన్నారు. ఇటీవల ఇతను మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలోనే అప్పుల పాలయ్యాడు. దీంతో ఇంటిని అమ్మాలని భార్యను అడగడంతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరికి పాల్పడి బలవన్మరణం చెందాడు.

రైల్వే గేటును ఢీకొన్న లారీ

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు లారీ రైల్వే గేటును ఢీకొంది. ఈఘటన మంగళవారం ఉదయం పేరాల సమీపంలోని కారంచేడు రైల్వే గేటు వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పర్చూరు వైపు నుంచి చీరాల వస్తున్న లారీ అదుపు తప్పి గేటును ఢీకొంది. ప్రమాదంలో గేటు దెబ్బతినడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని పరిశీలించారు.

టీచర్ల సంఘాలతో చర్చలు సఫలం

(5వ పేజీ తరువాయి)

పెరగకుండా చూస్తారు

- ప్రస్తుతం స్టడీలీవ్‌లో ఉండి ఆగస్టు 31లోపు జాయిన్ అయ్యేవారి స్థానాలను ఖాళీలుగా చూపించరు
- బదిలీలకు అన్ని ఖాళీ పోస్టులు చూపిస్తారు
- మోడల్ ప్రైమరీ స్కూళ్లను పీఎస్ హెచ్ఎంలుగా 1,382 మంది ఎస్జీటీలకు పీఎస్ హెచ్ఎంలుగా ప్రమోషన్ ఇస్తారు
- మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులు 120 మంది దాటితే అదనంగా మరో ఎస్జీటీ పోస్టు ఇస్తారు.
- రెండుసార్లు పునర్విభజనకు గురైన టీచర్లకు 7 పాయింట్లు ఇస్తారు.
- ఇతర మేనేజ్‌మెంట్లలో ఒక పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తిచేసిన టీచర్లు తమ సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లకు వెళ్లాల్సి ఉంటుంది.
- ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 20 దాటితే 2వ పోస్టు ఇస్తారు.
- ఐక్యవేదిక నాయకులతో కుదిరిన ఒప్పందం మేరకు ప్రభుత్వం బదిలీల మార్గదర్శకాల్లో సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది.

హైవేపై కారు బోల్తా - ఒకరు మృతి

మేదరమెట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల జాతీయ రహదారిపై తిరుమల వెళ్లి వస్తున్న కారు వేగం అదుపు కాక రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. మంగళవారం ఉదయం వేలూరు జిల్లా దెందురూరు మండలం కోవల్లి గ్రామానికి ఏడుగురు తిరుపతికి వెళ్లి తిరిగి వస్తూ మేదరమెట్ల ఫ్లైఓవర్ దాటాకా కారు వేగం అదుపు కాకా రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. కారులోని సుంకర నాగరాజు(21) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ పూజారా లక్ష్మణరావు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలు

(5వ పేజీ తరువాయి)

క్యాంపుల కమిటీకి కన్వీనర్‌గా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వ్యవహరించనున్నారు. అందులో సభ్యులుగా వైద్యులైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మిని సభ్యులుగా నియమించారు. అత్యంత కీలకమైన తీర్మానాల కమిటీలోనూ మంత్రి డాక్టర్ స్వామికి చోటు కల్పించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా ఉన్న వసతి ఏర్పాట్ల కమిటీకి జిల్లాకు చెందిన యువ నేత, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణను కోకన్వీనర్‌గా నియమించారు. అలాగే భోజనాల ఏర్పాట్ల కమిటీలోనూ ఆయన సభ్యుడిగా ఉన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని మరో ప్రధానమైన ఆర్థిక వనరుల కమిటీలో సభ్యునిగా నియమించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ కన్వీనర్‌గా జన సమీకరణ కమిటీ ఏర్పాటు చేయగా అందులో సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి ఉన్నారు. సాంస్కృతిక వ్యవహారాల కమిటీలో ఒంగోలుకు చెందిన రాష్ట్ర కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్వినిని నియమించారు. ఆయా కమిటీ సభ్యులు అన్ని జిల్లాల పార్టీ నేతలతో సమన్వయం చేసుకొని మహానాడు విజయవంతానికి కృషిచేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు.

సరికొత్త సంకటం

(5వ పేజీ తరువాయి)

ఏదో ఒకవిధంగా నెట్టుకొచ్చారు. ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు ఇంజనీరింగ్ కళాశాలను మూసివేయాలని నిర్ణయించడంతో ఒక సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో వసతి కల్పిస్తున్నారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఇప్పటి వరకు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ, ఒంగోలు కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తుండగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడు కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్ తెలిపారు.

ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఖాళీగా ఉన్న భవనాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందనున్న ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తారు. ఇక్కడ 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు ఖాళీగా ఉన్నాయి. వీరికి అక్కడ వసతి, తరగతులు నిర్వహించడం ద్వారా వాటిని వినియోగంలోకి తెస్తున్నారు. నూజివీడులో మొదటి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి ఇడుపులపాయ వెళ్తారు.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసిన వారు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరానికి ఒంగోలు రావాల్సి ఉంది. అయితే ఒంగోలులో రావ్‌అండ్‌నాయుడు కాలేజీ క్యాంపస్ మూసివేసినందున వారు ఇడుపులపాయలోనే ఇంజనీరింగ్ మొదటి సంవత్సరానికి ఉంటారు. ప్రస్తుతం అక్కడ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసిన వారు ద్వితీయ సంవత్సరానికి అక్కడే ఉంటారు. దీంతో రెండు సంవత్సరాల విద్యార్థులు అక్కడే ఉన్నట్లు అవుతుంది.

ఒంగోలులోని ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్ ఇంజనీరింగ్ 2, 3, 4 సంవత్సరాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు.

ఏడాదిలో సొంత భవనాలు

ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీకి ఏడాదిలో సొంత భవనాలు సమకూర్చనున్నట్లు ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ మధుమూర్తి హామీ ఇచ్చినట్లు డైరెక్టర్ భాస్కర్ పటేల్ తెలిపారు. ట్రిపుల్‌ఐటీకి స్థల సేకరణ, భవన నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లను పరిశీలించేందుకు ఏడుగురు సభ్యులతో కమిటీని కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి కనీసం 30 ఎకరాలు కేటాయిస్తే బహుళ అంతస్థుల భవనాలు నిర్మించుకొని తరగతులు, విద్యార్థులకు వసతి కల్పిస్తామని కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు. స్థల సేకరణకు కమిటీ సభ్యులు కనిగిరిలో తిరిగి భూములు పరిశీలించారన్నారు. ఏడాదిలోపు ప్రక్రియను పూర్తి చేసి తాత్కాలిక భవనాలైనా నిర్మించి 2026-27 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఇక్కడే తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని భాస్కర్ పటేల్ తెలిపారు.





దుద్దుకూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రవాగు

పూసపాడు అడ్డరోడ్డు వద్ద పొంగి ప్రవహిస్తున్న వాగు

వానొస్తే వెతలు!

● జలదిగ్బంధంలో ఇంకొల్లు ● అన్నివైపులా రాకపోకలు బంద్

ఇంకొల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి వాన కురిస్తే సరి ఇంకొల్లుకు నాలుగువైపుల ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలు పూర్తిగా నిలిచి పోతున్నాయి. పాతమద్రాసు రోడ్డులో ఇంకొల్లుకు ఇరువైపులా ఎర్రవాగు, కప్పవాగు ఉన్నాయి. ఇవి చిన్న వర్షానికే పొంగి ప్రవహిస్తున్నాయి. కప్పవాగుపై పూసపాడు అడ్డరోడ్డు వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈవాగు మీదగా ఐదారేళ్లుగా రాకపోకలు నిలిచిపోయాయి. నేలచప్టా నిర్మించారు. చిన్నపాటి వర్షానికి పొంగి ప్రవహిస్తుండటంతో ప్రయాణికులకు ప్రమాదభరితంగా ఉంది. ఈ దారిలో గుంటూరు ఆసుపత్రికి వేళ్లే రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుద్దుకూరు గ్రామం వద్ద ఎర్రవాగుపై నేలచప్టా కూడా చిన్నవానకే పొంగుతోంది. రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇంకొల్లు నుంచి ముప్పవరం వెళ్లే ఆర్ అండ్ బీ రహదారిలో అప్పేరు వాగుపై నీరు ప్రవహిస్తూ రాకపోకలు ఆగిపోతున్నాయి. ఈ రహదారిలో విద్యాసంస్థలు ఉండటంతో వాన కురిసినప్పుడు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చీరాల వెళ్లేందుకు కేసవరప్పాడు వద్ద వాగుపై నేలచప్టా పొంగి పారుతోంది. ఇంకొల్లు నుంచి ఏ ప్రధాన నగరానికి చేరుకోవాలన్నా ప్రయాణికులకు వెతలు తప్పడం లేదు. ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



నాగండ్ల వద్ద నేలచప్టాపై ప్రవహిస్తున్న వాగు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌అన్సారియా

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో ఎలాంటి పెండింగ్ లేకుండా రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి రెవెన్యూ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూములు అప్పగింత, రీ సర్వే రెవెన్యూ సర్వీసులు, వాటర్‌ట్యాక్స్ తదితర అంశాలపై ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమీక్షించి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మంజూరు చేసినా, ప్రతిపాదించిన వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ చేసి వెంటనే భూములను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన ప్రణాళికలను మండలాల వారీగా రూపొందించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములు అక్రమించుకొనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం లేకుండా భూమలు రీ సర్వే ప్రక్రియను పూర్తిచేసే విధంగా చూసుకోవాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, వెంకటశివరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు వరకుమార్, సత్యనారాయణ, శ్రీధర్, జిల్లా సర్వే అధికారి గౌస్‌బాషా పాల్గొన్నారు.

26 నుంచి వ్యాధి నిరోధక టీకాలు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మీజిల్స్, రుబెల్లా వ్యాధినిరోధక టీకాలను ఈనెల 26 నుంచి వచ్చేనెల 26 వరకు చిన్న పిల్లలకు వేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాధినిరోధక టీకాలను మొదటి డోసు 9 నుంచి 12 నెలల మధ్య వేయాల్సి ఉందన్నారు. 9 నెలల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి మొదటి రౌండ్ ఈనెల 26 నుంచి 31వతేదీ వరకు, రెండవ రౌండ్ వచ్చేనెల 23 నుంచి 28 వరకు, మూడవ రౌండ్ జూలై 21 నుంచి 26వ తేదీ వరకు వేయనున్నట్లు తెలిపారు.

ఓపెన్‌టెన్త్ సప్లిమెంటరీలో ఒకరు డిబార్

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో మంగళవారం ఒక విద్యార్థి డిబార్ అయ్యారు. ఒంగోలు శ్రీ సూర్య హైస్కూలులో ఇంగ్లీషు పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డీఈవో కిరణ్‌కుమార్ పట్టుకొని డీబార్ చేశారు. ఆ పరీక్ష హాలులో ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిని పరీక్షల విధుల నుంచి తొలగించారు. మంగళవారం పరీక్షకు 653 మందికి 511 మంది హాజరు కాగా 142 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూలు ఇంటర్ తెలుగు పరీక్షకు 1013 మందికి 838 మంది హాజరు కాగా 175 మంది గైర్హాజరయ్యారు. హిందీ పరీక్షకు 14 మందికి 11 మంది, ఉర్దు పరీక్షకు ఇద్దరు విద్యార్థులు హాజరయ్యారు. పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 281 మందికి కేవలం 71 మంది పరీక్షకు హాజరు కాగా 215 మంది గైర్హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.



గిద్దలూరు మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కార్యకర్తే పార్టీకి అధినేత

● గిద్దలూరు మినీ మహానాడులో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తే టీడీపీకి అధినేత అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడును నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి గతంలో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.2 లక్షల ప్రమాద బీమా అందిస్తే, ఇప్పుడు రూ.5లక్షలకు పెంచారన్నారు. ఇటీవల నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందిందని గుర్తు చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు సెల్యూట్

● ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా గిద్దలూరులో బైక్ ర్యాలీ

గిద్దలూరు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడానికి కృషి చేసిన త్రివిధ దళాలకు సెల్యూట్ అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత గాంధీబొమ్మ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి బైక్ ర్యాలీ కూరగాయల మార్కెట్, కుమ్మరాంకట్ట, రైల్వేస్టేషన్, రాచర్ల గేటు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలతోపాటు మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు. జై భారత్, జై సిందూర్ అనే నినాదాలు హోరెత్తాయి. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనిక ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

దొనకొండ విమానాశ్రయం భూమి పరిశీలన

దొనకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా దొనకొండలో నిరుపయోగంగా ఉన్న విమానాశ్రయానికి చెందిన భూమిని గన్నవరం ఎయిర్‌పోర్టు సివిల్ ల్యాండ్ అసిస్టెంట్ మేనేజర్ మోహన్ బృందం మంగళవారం పరిశీలించింది. స్థానిక విమానాశ్రయం ఇన్‌చార్జ్ రామకృష్ణ భూమికి నలుదిక్కుల హద్దులను చూపారు. ముళ్లచెట్లు, గడ్డి విపరీతంగా ఉన్నా చుట్టూ తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. బ్రిటీష్ వారు నిర్మించిన భవనం, హెలిప్యాడ్‌ను, ఎయిర్‌పోర్టు అధికారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. దొనకొండ విమానాశ్రయానికి చెందిన భూమి ఎయిర్‌పోర్టు అథారిటీ పేరు మీద మ్యుటేషన్ చేయించేందుకు, ఈ భూమి ఏమైనా ఆక్రమణలకు గురైందా, చుట్టూ ఫెన్సింగ్ ఏ విధంగా ఉంది, తదితర సమాచారాన్ని తెలుసుకునేందుకు వచ్చినట్లు ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారి మోహన్ తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఎయిర్‌పోర్టు అథారిటీ శిక్షణ కేంద్రం ఏర్పాటు నిమిత్తం అన్ని జిల్లాల్లోని విమానాశ్రయాలను పరిశీలించే క్రమంలో దొనకొండలోని విమానాశ్రయాన్ని చూసేందుకు ఈ బృందం వచ్చినట్లుగా విశ్వసనీయ సమాచారం. 1935లో బ్రిటీష్ వారు మద్రాస్-హైదరాబాద్ మధ్యలో ఉన్న దొనకొండను ఎంపిక చేసుకొని నరసింహనాయునిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 14లో 136.35 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయం నిర్మించారు. అప్పట్లో విమానాలు, హెలికాప్టర్లు ఇంధనం నింపుకొనేందుకు వస్తుండేవి. 1965 నుంచి రాకపోకలు నిలిచిపోవటంతో విమానాశ్రయం నిరుపయోగంగా మారిందని నాటి పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిరుపయోగంగా ఉన్న దొనకొండ విమానాశ్రయంను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడితే ఎంతో వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు భావిస్తున్నారు.



దొనకొండలోని విమానాశ్రయం భూమిని పరిశీలిస్తున్న గన్నవరం ఎయిర్‌పోర్టు సివిల్ ల్యాండ్ అసిస్టెంట్ మేనేజర్ మోహన్ బృందం

23 నుంచి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

తర్లుపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానాగులవరం శ్రీ వీరాంజనేయ స్వామి జయంతి మహోత్సవం సందర్భంగా ఈనెల 23 నుంచి రాష్ట్ర స్థాయి బండ లాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ రూ.40వేలు, తృతీయ రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 24న 6పండ్ల విభాగం పోటీలు జరుగుతాయని పోటీలు గెలుపొందిన వారికి వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 83090 77711, 96522 46070 సంప్రదించాలని కోరారు.


ఈ నీరు తాగితే ఇంకేమైనా ఉందా?

గుండ్లకమ్మలో చేపల పెంపకం

- ఆహారంగా చనిపోయిన కోడి వ్యర్థాలు
- కొళాయిల్లో రంగుమారిన నీరు... కుళ్లుడు వాసన
- రోగాల భయంలో నగర ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మణికేశ్వరం వద్ద నీటిలో చేపల పెంపకం



గుండ్లకమ్మలో కోడి వ్యర్థాలు

తాగునీటి వనరులను కొందరు వ్యాపారానికి అనువుగా మార్చుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారు. గుండ్లకమ్మలో కొందరు చేపల పెంచుతూ, కోడి వర్థాలు వదులుతున్నారు. ప్రతిరోజూ చేపల ఆహారంగా చికెన్ స్టాల్స్ నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను కాలువల్లో వేయడంతో చనిపోయిన కోడి కాళ్లు, రెక్కలు, రక్తం నీటిలో కలిసి తాగునీటి కొళాయిల్లో రావడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఒంగోలుకు విడుదలయ్యే తాగునీరు ఫిల్టర్ అయినా కలుషితంగా ఉంటోంది. నగరవాసులకు రోగాలయ భయం వెంటాడుతోంది. రెండు, మూడు నెలలుగా నగరంలో విడుదలయ్యే నీరు రంగుమారి, పచ్చగా రావడంతోపాటు నీచు వాసన రావడంతో అధికారులకు సైతం అర్థం కాని పరిస్థితి నెలకొంది. మణికేశ్వరం గ్రామం నుంచి వినుకొండ వరకు నీటి కాలువల్లోనూ కొందరు చేపలు పెంచుతున్నారు.

ఒంగోలు, కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం లక్షలు వెచ్చించి, సురక్షితమైన నీరు అందించాలని భావించినా కొందరి నిర్లక్ష్యం మూలంగా ప్రజలు రోగాల బెడద వెంటాడుతోంది. గుండ్లకమ్మ నుంచి ఒంగోలు వేసవి చెరువులకు చేరుతున్న నీరు ఫిల్టర్ బెడ్‌లు, పంప్ హౌస్‌ల నుంచి ప్రతిరోజూ నగరంలోని నివాసాలకు చేరుతుండగా, గడిచిన మూడు నెలలుగా పాచి రంగుతోపాటు, దుర్వాసన వస్తోంది. ఇదే విషయాన్ని కొందరు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రోజూ నీటి సరఫరా సమయంలో నీటి పరీక్షలు నిర్వహించిన అధికారులు గుండ్లకమ్మ, రామతీర్థం నీరు కలిసి వేసవి చెరువులకు విడుదలవుతున్న నేపథ్యంలో ఇలాంటి సమస్య ఎదురవుతున్నట్లుగా భావించారు. ఎలాంటి ప్రమాదమూ లేదని కొట్టిపడేశారు. ప్రజలు ఆందోళన చెందవద్దంటూ ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. అయితే అసలు సమస్య ఎక్కడ ఎదురవుతుందో పరిశీలించేందుకు కార్పొరేషన్ అధికారులు గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు చేరే నీటి కాలువలపై పర్యటించారు. లోపాన్ని గుర్తించేందుకు వారంపాటు శ్రమించారు. ఆ తర్వాత వారు గమనించిన విషయం చూసి విస్తుపోయారు. ఈ నీరు తాగితే ఇంకేమనా ఉందా? అంటూ కార్పొరేషన్ అధికారులే అవాక్కయ్యారు.

● నీటి సరఫరా కాలువల్లో చేపలు పెంపకం

గుండ్లకమ్మ నుంచి మంచినీటి కాలువల్లో చేపల పెంపకం చేయడం, వాటికి ఆహారంగా చనిపోయిన కోడి వ్యర్థాలు వేయడం గుర్తించిన అధికారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. నీటి సరఫరా కాలువల్లో ప్రత్యేకంగా కర్రలు వేసి, నెట్‌లు ఏర్పాటు చేసి చేపలు పెంచడం, వాటిలో టన్నుల కొద్ది వ్యర్థాలు వేయడాన్ని పరిశీలించారు. మణికేశ్వరం గ్రామం నుంచి వినుకొండ వరకు ప్రతి చోట ఇదే పరిస్థితి ఉండటం చూసిన అధికారులు నియంత్రణ ఎలా? అనే విషయంపై తలపట్టుకు కూర్చున్నారు. వీటి కారణంగానే నగరంలో రంగుమారి, దుర్వాసనతో కూడిన నీరు వస్తోందని గుర్తించారు. కలుషిత నీటి నియంత్రణపై చర్యలు తీసుకునేందుకు సీరియస్‌గా దృష్టి సారించినా, సమస్య ఉన్న గ్రామాలు కార్పొరేషన్ పరిధిలోకి రాకపోవడంతో వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే మంచినీటి కాలువల్లో చేపల పెంపకం, కోడి వ్యర్థాలపై అక్కడి అధికారులు సైతం మౌనంగా ఉండటంతో సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేయాలని భావిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించి, గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు చేరే నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన శుద్ధ నీరు సరఫరా కోసం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రంగుమారిన తాగునీరు



కలెక్టర్ అన్సారియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

కలెక్టర్‌తో ఎమ్మెల్యేల భేటీ

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్ మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాతో భేటీ అయ్యారు. ప్రకాశంపంతులు వర్ధంతి కార్యక్రమం అనంతరం కలెక్టర్ చాంబర్‌లో వారు మాట్లాడుకున్నారు. ఒంగోలుతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల అంశాలపై కలెక్టర్‌తో దామచర్ల చర్చినట్లు సమాచారం. ఇక సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ కూడా పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కరుణాకరరెడ్డి, అభిమానులు

చీమకుర్తి, మే20(ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని పి.నాయుడుపాలెం గ్రామంలో మంగళవారం అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకరరెడ్డి ప్రారంభించారు. దాదాపు 200మంది తమ అభిమానులు రక్తదానం చేశారు. కరుణాకరరెడ్డి వారిని అభినందించారు. కార్యక్రమంలో శిరోమణి పాల్గొన్నారు.

మా భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు..

● బాధితురాలి ఆవేదన

ఒంగోలు కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం వీఐపీరోడ్‌లోని పాత సుజాతనగర్‌లోని సర్వే నెం. 279/1బి1లో తన పట్టా స్థలంలో తమను ప్రవేశించకుండా అధికారులు అడ్డుకుంటున్నారని షేక్ ఆశాబి ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంసీపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంతో తన కుమార్తెలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ 24 సంవత్సరాల క్రితం తన భర్త ఖాజావలి వన్‌టౌన్‌లో జరిగిన లాకప్‌డెత్‌లో చనిపోయారని, ఇందుకు నష్టపరిహారంగా తహసీల్దార్ చిరంజీవి, కలెక్టర్ సునీల్‌కుమార్ తమకు డీకే పట్టా (నెం.1/1411) ఇచ్చారని తెలిపారు. అయితే తమ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు వెళుతుండగా, స్థానికులు అడ్డగించారని తెలిపారు. స్థానికంగా ఉండే ఒకరు ఆ స్థలాన్ని కమ్యూనిటీ హాలుగా కేటయించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారని, అయినా కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఆశాంబి తెలిపారు. సోమవారం తాము స్థలంలోకి వెళ్ళే ప్రయత్నం చేయగా టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారని చెప్పారు. తమ స్థలంలోకి తాము వెళ్ళేందుకు అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. సమావేశంలో ఆమె కుమార్తెలు షేక్ హుస్సేన్, కరీమా పాల్గొన్నారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి



అహల్యాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): మాల్వా వంశపు మహారాణి, రాజమాత అహల్యాబాయి హోల్కర్ 300జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని బొమ్మరిల్లు అనాథాశ్రమంలో మంగళవారం జయంతి వేడుకల కన్వీనర్ జిల్లెళ్ళమూడి రమాదేవి, కో కన్వీనర్ ఆనం ఆశారావుల ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహల్యాబాయి తన పరిపాలనలో హిందు మత రక్షణకు, ధార్మిక సంస్థల నిర్వహణకు ఎంతో కృషి చేశారని చెప్పారు. తన సైన్యాన్ని తానే నాయకత్వం వహించిన ధీశాలిగా వారు అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు మాకినేని అమరసింహం, దండు శ్రీనివాసరావు, కాటా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సీహెచ్‌వోల దీక్షలు



దీక్షలో పాల్గొన్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు మంగళవారానికి 22వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కమ్యూనిటిహెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంటా ప్రసన్న, జీవన జ్యోతి, శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా బర్లీ పొగాకు రైతులను గుర్తించి నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతిబాబు, పమిడి వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బర్లీపొగాకు సాగు చేసిన రైతులు ఎక్కువ మంది కౌలు రైతులు ఉన్నారన్నారు. పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు భూమి యజమానులు కౌలు రాసి ఇవ్వకపోవడంతో ఈ-క్రాప్ చేయించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు.

గోడను ఢీకొన్న లారీ.. డ్రైవర్ మృతి



ఇంటిలోకి దూసుకెళ్లిన లారీ

ఎర్రగొండపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మేడపి గ్రామంలోని హైవే పక్కన పాడుబడిన బిల్డింగ్ గోడను మంగళవారం లారీ ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ అవుల వెంకటనారాయణ (30) అక్కడికక్కడే మృతి చెందారు. ముడివేముల గ్రామానికి చెందిన వెంకటనారాయణ పొగాకు లోడుతో గుంటూరు వెళ్లి వస్తుండగా నిద్రమత్తులో రోడ్డు మార్జిన్ దిగి ఖాళీగా ఉన్న బిల్డింగ్‌లోకి లారీతో దూసుకుపోయాడు. క్యాబిన్‌పై శ్లాబు పడి వెంకటనారాయణ మృతి చెందినట్లు ఎస్ఐ బసవరాజు తెలిపారు.

ప్రకాశంపంతులును స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎస్పీ దామోదర్ పిలుపు ● ఘనంగా ఆంధ్రకేసరి వర్ధంతి కార్యక్రమాలు ● నివాళులర్పించిన అధికారులు, నాయకులు



ఎస్పీ కార్యాలయలో నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్



రవాణాశాఖ కార్యాలయంలో డీటీసీ సుశీల, సిబ్బంది నివాళి

ఒంగోలు క్రైం, మే20(ఆంధ్రజ్యోతి): ప్రకాశంపంతులు ఆశయాలు భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పోలీస్‌శాఖ తరపున ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రకాశంపంతులు చిత్రపటానికి ఎస్పీ దామోదర్ పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీ కార్యాలయంలో..

స్థానిక ఉపరవాణాశాఖ కార్యాలయంలో ప్రకాశంపంతులు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి చిత్రపటానికి డీటీసీ ఆర్.సుశీల పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్‌ప్రభాకర్, సురేంద్రప్రసాద్, రామచద్రరావు, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

ఒంగోలు కలెక్టరేట్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ద్రావిడదేశం కృష్ణారావు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని ప్రకాశంపంతులు విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యంకోసం ప్రకాశంపంతులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బంకా చిరంజీవి, పెద్దన్న, మురళీకుమార్ పాల్గొన్నారు.

ఏకేయూలో...

ఒంగోలు విద్య: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి పిలుపునిచ్చారు. స్థానిక యూనివర్సిటీలో ప్రకాశంపంతులు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి.రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలి

● వ్యవసాయ, కార్మిక సంఘాల డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని పలువురు వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా కార్పొరేషన్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలు 200 రోజులకు పెంచాలని, కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేక తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని మరింతగా విస్తరించాలన్నారు. రైతు కూలీ సంఘం కార్యదర్శి లలితకుమారి మాట్లాడుతూ స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, చీకటి శ్రీనివాసరావు, పి.కల్పన, పెంట్యాల హనుమంతరావు, రాజశేఖర్, దాసరి సుందరం, జార్జి, సారథి, మోహన్, కె.వెంకటేశ్వర్లు, ఎంఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నాగులుప్పలపాడు: అన్ని వర్గాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త హర్తాళ్‌లో భాగంగా ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు, కండ్లగుంట తదితర గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు వ్యక్తం చేశారు. సచివాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలపర్తి యోనా, రావెళ్ల వెంకట్రావు, ఎస్.కృష్ణారావు, ఎన్.రామారావు, కె.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడ: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సంనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు, వ్యవసాయ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, వెంకటసుబ్బారావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, పెద్దబ్బాయ్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

● యూనియన్ నాయకుల డిమాండ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లుగా పనిచేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి పెంట్యాల కల్పన ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కేవలం రూ.7,870 వేతనంతో గత తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న వాహనడ్రైవర్లకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. వైద్యఆరోగ్యశాఖలో నిరంతరం పనిచేస్తున్న వాహన డ్రైవర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం పేరుతో వెట్టిచాకిరి చేపిస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, నాయకులు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 1, 2లను ఎంఈ చంద్రయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీరు, రంగుమారిన నీరు విడుదలవుతుందని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు మేరకు ఎమ్మెల్యే దామచర్ల ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు నీటిసరఫరా విధానాన్ని పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్‌లను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. నీటి సరఫరా జరిగే ప్రతి రోజు పరీక్షలు చేయాలని ఆదేశించారు. అలాగే లీకులు, మురుగునీటి కాలువల్లో పైపులైనులు కారణంగా నివాసాలకు చేరే నీరు కలుషితం అవుతుంటే ఆయా సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో మహిళ అరెస్ట్

● 12.7 తులాలు రికవరీ



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేసిన ఓ మహిళను మార్కాపురం టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 12.7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు చోరీ వివరాలను వెల్లడించారు. కొమరోలు మండల కేంద్రానికి చెందిన మజ్జారి బాలవెంకటయ్య కుటుంబసభ్యులతో కలిసి మార్కాపురం పట్టణంలో బంధువుల పెళ్లికి వెళ్లేందుకు ఈ నెల 18 సాయంత్రం ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మార్కాపురం చేరిన వెంటనే వారితో తెచ్చుకున్న లగేజీని చూసుకోగా బంగారు ఆభరణాలు ఉన్న సంచి కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు అన్ని కోణాల్లో వెదుకులాట ప్రారంభించారు. కంభం బస్టాండ్ వద్ద వారితో ప్రయాణించిన ఒక జంట దిగినట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా విచారించారు. సీసీ పుటేజీల్లో ఒక జంట బాధితులకు చెందిన బ్యాగుతో కంభం బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. బ్యాగును దొంగిలించిన మహిళ కోసం గాలించగా జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో నివాసముంటున్న దూదేకుల హుసేన్‌బీగా గుర్తించారు. మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. కేసును ఛేదించిన పట్టణ పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించి రివార్డ్‌ను అందజేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం వల్ల పంట నష్టాలు లేవు : ఏవో

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల మద్దిపాడు మండలంలో ఎలాంటి పంట నష్టం లేదని ఏవో జి.రమేష్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దకొత్తపల్లి, ఇనమనమెళ్లూరు, సీతారాంపురం గ్రామాల్లోని పంటలను వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఉద్యానవన పంటలకు ఈ వర్షం మేలు చేసిందని రైతులు తెలిపారు. వర్షాలకు పంట దెబ్బతింటే వ్యవసాయ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఏవో రమేష్ కోరారు.

రేషన్‌కార్డుల సమస్యలను పరిష్కరిస్తాం..

రేషన్‌కార్డులకు సంబంధించి సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి కోరారు. రేషన్‌కార్డుల్లో పేరు మార్పులు, చేర్పులను స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

మహానాడును విజయవంతం చేయాలి

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో 22వ తేదీన జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని మద్దిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

గ్రంథాలయ సభ్యత్వాలను పెంచాలి



ప్రకాశంపంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలక్ష్మి, వసుంధరాదేవి

మద్దిపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సభ్యత్వాలు పెంచేలా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మద్దిపాడులోని గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవన నిర్మాణం త్వరితగతిని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం టంగుటూరి ప్రకాశంపంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంధ పాలకురాలు వసుంధరదేవి, విశ్రాంత గ్రంథపాలకుడు గంగిశెట్టి నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు సామాజిక స్పృహ అవసరం

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ పెంచుకోవాలని ఎంసీ.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మారెళ్లగుంటపాలెం ఆసరా కేంద్రంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, వారి సామర్థ్యాలను గుర్తించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 8,9,10 తరగతి విద్యార్థులు దాదాపు 45 మంది హాజరవుతున్నారని అన్నారు. కేవీవీ.ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు భోజనం సైతం అందిస్తున్నామని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. షేక్ కరీముల్లా గత 16 సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఇంటి నుంచి అప్పుడప్పుడు వెళ్లి కొద్దిరోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తూ ఉండేవారని, ఇదేక్రమంలో 2024 ఆగస్టులో బయటకు వెళ్లిన అతను ఇంతవరకు తిరిగి రాలేదని ఆయన భార్య షేక్ మొగల్‌జాన్‌బి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు శివరామయ్య వెల్లడించారు.

చిర్రికూరపాడువాసికి డాక్టరేట్



మధు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య కళాశాలలో ఫార్మసీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జరుగుమల్లి మండలం చిర్రికూరపాడుకు చెందిన ఎం.మధుకు డాక్టరేట్ లభించింది. అనంతపురం జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో మధు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్వీ.సత్యనారాయణ, డాక్టర్ శరవణకుమార్ ఆధ్వర్యంలో ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో డెవలప్‌మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ యుపీఎల్సీ మెథడ్స్ డోసేజ్ ఫార్మ్స్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన ఔషధ పరిశ్రమలో నాణ్యత, నియంత్రణ పరీక్షల్లో విశేషంగా ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన మధును చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, సి.అభిషేక్, వైస్ చాన్సలర్ ఇ.సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ డి.స్వర్ణలత, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఆంధ్రాస్కూలు అధినేత బొమ్మల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

డాక్టర్ వెంకటేశ్వరరావుకు సత్కారం



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రిమ్స్‌లో మొదటి సారిగా గుండె ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ కుంచాల వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. స్థానిక రిమ్స్‌లో మంగళవారం వడియరాజుల సేవా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వెంకటేశ్వరరావును కలిసి సత్కరించారు. రిమ్స్ చరిత్రలో మొదటిసారిగా గుండె ఆపరేషన్‌ను విజయవంతంగా చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, కుంచాల బ్రహ్మయ్య, తన్నీరు ప్రసాద్, దేవళ్ళ మాధవ్ పాల్గొన్నారు.

నేడు శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నాగులుప్పలపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల గ్రామ పంచాయతీ మద్దిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన 27 అడుగుల శ్రీఅభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం వేదపండితులు అగ్నిప్రణయం, కుంభారాధన, జలాధివాసం, హోమాలు, సాయంత్రం స్వామి వారి విగ్రహ ఊరేగింపు, బలిహరణ నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు చేపడుతున్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేసిందన్నారు. అందువల్ల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కిరణ్‌రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా 'కాట్రగడ్డ'

నాగులుప్పలపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన కాట్రగడ్డ శ్రీనివాసరావును ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.


ముగింపు పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

ముగిసిన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్ మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లిలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 12వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ చైర్మన్ యక్కలి బాల వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి రోజు స్వామి వారు వివిధ ఆలంకరణలో దర్శనమిచ్చారు. మంగళవారం చివరి రోజు పూర్ణాహుతి, చక్ర స్నానం, హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు అన్నమరాజు రమేష్ శర్మ, బొడ్డుపల్లి పవన్ కుమార్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజులు, గ్రామోత్సవాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు సన్మానించారు.

వేసవి శిక్షణతో ఉపయోగకరం

మార్కాపురం వన్‌టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో దాగివున్న ప్రతిభను వెలికితీయటానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని విశ్రాంత ఉప సంచాలకులు డా. ఏ.వీరారెడ్డి అన్నారు. శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదరంగంలో, పుస్తకాలు డంలో, కథలు చెప్పించడంలో పొందుతున్న శిక్షణను డా. వీరారెడ్డి పరిశీలించి విలువైన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి, ఉపాధ్యాయుడు ఎంవీ సుబ్బారావు పాల్గొన్నారు.

బేస్తవారపేట : గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులతో ఎంతో ఉపయోగమన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, కథలు చదవడం నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గిద్దలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : వాసవీ జాగృతి ఆధ్వర్యంలో వేసవి తాపం నుంచి కాపాడేందుకు వీలుగా ప్రజలకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మజ్జిగ, లస్సీలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, అమ్మవారిశాల గౌరవాధ్యక్షుడు గర్రె సత్యనారాయణ, వాసవి జాగృతి సంస్థ అధ్యక్షుడు శివపురం హరికృష్ణ పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

తర్లుపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. బాలికల విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిత్వ పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. బాలికలకు విద్య, న్యూట్రిషన్, ఆరోగ్యం, యోగా, ఫిట్‌నెస్ తదితర అంశాలపై కూడా వివరించారు. బాలికలకు బాల్య వివాహాలు, అత్యాచారాలు, పోక్సో, ఆత్మరక్షణ, వృత్తి విద్య వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్, సచివాలయ మహిళా పోలీస్ మౌనిక, ఏఎన్ఎం నాగస్రవంతి, అంగన్‌వాడీ టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా జూ.ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

గిద్దలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా 30 మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు బేస్తవారపేట తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చి రక్తదానం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీన్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రతినిధులు హబీబ్‌ఖాన్, రసూల్‌ఖాన్, అక్బర్‌ఖాన్ పాల్గొనగా రక్తదానం చేసిన వారికి నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు.

ఉపాధి ద్వారా కోనేరు అభివృద్ధి పనులు


వెంకటాద్రిపాలెంలో పనులు ప్రారంభిస్తున్న ఏపీవో శైలజ

ఎర్రగొండపాలెం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పాత కోనేరులలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎర్రగొండపాలెం ఏపీవో శైలజ తెలిపారు. మండలంలోని వెంకటాద్రిపాలెంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన కోనేరులో పునఃనిర్మాణం కోసం సుమారు రూ.2.40లక్షలతో అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాత కోనేరులను వాడకంలోకి తెచ్చేందుకు ఈ పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ పనులు చేపట్టడం ద్వారా గతంలో మాదిరి కోనేరులు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. కోనేరులో అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామ ప్రజలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా మండలంలోని పాత కోనేరులను కూడా అభివృద్ధి చేసి ఉపయోగపడేలా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కందకాల పరిశీలన

మండలంలోని గాంధీనగర్ చెంచు గూడెంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సాగులో ఉన్న కందకాల పనులను ఎర్రగొండపాలెం చెంచు క్లస్టర్ ప్రత్యేకాధికారి కే నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. వేతనాలకు తగిన పనులు చేపట్టాలని కార్మికులకు సూచించారు. అలాగే గూడెంలోని రైతు భూమని మంతయ్య ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసిన బత్తాయి తోటలను ఆయన పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాలలో ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బంది ఉన్నారు.

గోడను ఢీకొని లారీ డ్రైవర్ మృతి

ఎర్రగొండపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండలం మేడపి గ్రామం వద్ద గుంటూరు - కర్నూలు జాతీయ రహదారి పక్కన పాడుబడిన బిల్డింగ్ గోడను మంగళవారం లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌ఆవుల వెంకటనారాయణ (30) మృతి చెందారు. మండలంలోని ముడివేముల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఆవుల వెంకటనారాయణ సోమవారం పొగాకు లోడుతో గుంటూరు వెళ్లి పొగాకు అన్‌లోడ్ చేసి ఖాళీ లారీతో త్రిపురాంతకం వైపు వస్తున్నాడు. నిద్రమత్తులో రోడ్డు మార్జిన్ దిగిపోయి ఖాళీగా ఉన్న బిల్డింగ్‌లోకి లారీతో దూసుకుపోయాడు. లారీ క్యాబిన్‌పై స్లాబు పడిపోవడంతో డ్రైవర్ వెంకటనారాయణ ఇరుక్కుపోయి మృతి చెందినట్లు ఎస్ఐ బసవరాజు తెలిపారు.


బిల్డింగ్‌లోకి దూసుకెళ్లిన లారీ

పల్లె వైద్యం.. పేదలకు దూరం


అర్ధవీడు మండలం కాకర్లలోని విలేజి క్లినిక్ భవనం


నాగులవరంలోని విలేజి క్లినిక్

- గత వైసీపీ పాలన మత్తులో నుంచి బయటపడని వైద్య ఆరోగ్యశాఖ

కంభం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం సబ్ డివిజన్‌లో గ్రామీణ ప్రాంతాల రోగులకు వైద్య సేవలు అందించాల్సిన విలేజి హెల్త్ క్లినిక్‌లు సక్రమంగా తెరచుకోవడం లేదు. ఆయా క్లినిక్‌లకు సిబ్బంది నామమాత్రంగా హాజరవుతుండడంతో సమయానికి పేదలకు వైద్యం అందడం లేదు. మార్కాపురం డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లోని పల్లెల్లో ఉన్న విలేజ్ క్లినిక్ ఆసుపత్రుల్లో సేవలు అందకపోవడంతో ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. అత్యవసర వైద్యం కోసం పట్టణాలకు వెళ్లే వారు మార్గమధ్యంలోనే ఆరోగ్యం విషమించి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. క్లికిక్‌ల దుస్థితి కళ్లెదుట కనపడుతున్నా జిల్లా వైద్యశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అర్ధవీడు మండలం నల్లమల అటడికి దగ్గరగా నియోజకవర్గానికి దూరంగా రెండు పాయలుగా చీలి ఉండడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సిబ్బంది ఎప్పుడు వస్తారో, వెళతారో తెలియని పరిస్థితి ఉంది. సిబ్బందిని డాక్టర్ ఎక్కడకు వెళ్లారని అడిగితే క్యాంప్‌లో ఉన్నట్లు సమాధానం వస్తుంది. 3 నియోజకవర్గాల్లో సుమారు 100 వరకు విలేజి క్లినిక్‌లను గత వైసీపీ హయాంలో ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో సిబ్బందిని కూడా నియమించారు. వీటి సేవలు అంతంత మాత్రంగా ఉండడంతో పేదలకు వైద్య సేవలు అందడం లేదు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన క్లినిక్‌లకు అద్దె భారం తప్ప సేవలు లేవు. వీటిని పర్యవేక్షించాల్సిన పీహెచ్‌సీ వైద్యులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ దుస్థితి తలెత్తింది. చాలా కేంద్రాలకు సిబ్బంది చుట్టంచూపుగా వచ్చి వెళ్తున్నారు. కొన్ని చోట్ల కేంద్రాలు తెరుస్తున్న దాఖలాలు కూడా లేవు. అర్ధవీడు మండల పరిధిలోని గ్రామాల్లో సిబ్బంది హాజరు కాకుండా ఆశా కార్యకర్తలతో క్లినిక్‌లను తెరిపించి మమ అనిపిస్తున్నారు. పెద్దారవీడు, దోర్నాల, పుల్లలచెరువు, మార్కాపురం, రాచర్ల, గిద్దలూరు మండలాల పరిధిలోని అటవీ ప్రాంత పల్లెల్లో కేంద్రాలకు తాళాలే తీయడం లేదు. దీంతో రోగులు చిన్నపాటి జ్వరాలకు వైద్యం అందక దూర ప్రాంతాలకు పరుగుతీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్లినిక్‌లను తెరిచి సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మినీ మహానాడు

ఎర్రగొండపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ కార్యాలయం ఆవరణలో బుధవారం తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు మంగళవారం తెలిపారు. టీడీపీ కార్యాలయం ఆవరణలో మినీ మహానాడు సభ పార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల టీడీపీ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘ నాయకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని మినీ మహానాడు సభను విజయవంతం చేయాలని సుబ్బారావు కోరారు.

పెద్దారవీడులో క్షుద్ర పూజల కలకలం

- పురాతన గంగమ్మ గుడి సమీపంలో గుంత తీసిన ఆనవాళ్లు
- నిమ్మకాయలు, కుంకుమతో పూజలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు




గంగమ్మ గుడి సమీపంలో గుంత పూడ్చిన ఆనవాళ్లు అల్లు పాలంకిరెడ్డి పొలంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

పెద్దారవీడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పెద్దారవీడులో గుర్తు తెలియన వ్యక్తులు చేసిన క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఆర్టీసీ బస్టాండ్ వెనుక వెలసివున్న పురాతన గంగమ్మ ఆలయం సమీపంలో కుంకమ్మ, నిమ్మకాయలతో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లను పొలం యజమాని అల్లు పాలంకిరెడ్డి మంగళవారం గుర్తించారు. అనంతరం సమీపంలోని చెంచుగూడెంలో విచారించగా శుక్రవారం రాత్రి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేసినట్లు తెలిపారు. పొలం పనులలో భాగంగా తవ్వకాలు జరుపుతున్నట్లు భావించినట్లు గిరిజనులు తెలిపారు. కుంకుమ, నిమ్మకాయలతో పూజ చేసిన స్థలం సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న హనుమాన్ శోభాయాత్ర కమిటీ నాయకులు

మార్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో ఈ నెల 22న జరిగే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని కమిటీ నాయకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు ఆ వివరాలు వెల్లడించారు. ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నింటిలో ఈ శోభాయాత్ర జరుగుతుందన్నారు. హిందూ సంఘాలు అన్ని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి చిన్నవీరారావు, హిందూ చైతన్య వేదిక నాయకులు తానుగుండాల వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, సాయిబాబా మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, శోభాయాత్ర కమిటీ నాయకులు గుంటక వనజాక్షి, నారాయణం తులసి పాల్గొన్నారు.


ద్రాక్షాపండ్ల అలంకరణ ఆంజనేయుడు

ఆంజనేయునికి ద్రాక్ష పండ్లతో అలంకరణ

మార్కాపురం వన్‌టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాగులపుట్ట వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు రొంపిచర్ల చైతన్య కుమార్ ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, అలంకరణ, నివేదన, విశేష అర్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి మూలవిరాట్‌కు ద్రాక్ష పండ్లతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు కాశీరామ్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, కోశాధికారి రామడుగు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రారంభమైన జయంతి వేడుకలు

గిద్దలూరు : పట్టణంలోని రేడియో బావి సెంటర్ వద్ద గల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరగనున్న హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా తొలిరోజు మంగళవారం స్వామి వారికి గణపతిపూజ, ఆంజనేయస్వామికి అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలు దేవస్థాన ప్రధాన అర్చకులు రాజశేఖరశర్మ నిర్వహించారు. భక్తులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం లక్ష తమలపాకుల పూజ, మహా మంగళ హారతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు దాతల సహకారంతో అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

జీవో-4పై వీఆర్వోల నిరసన


తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

పొదిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : జీవో నెం.4 వలన వీఆర్వోలకు పనిభారం పెరుగుతుందని మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వీఆర్వోల సంఘం అధ్యక్షుడు బాలవెంకటరెడ్డి మా ట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో ఇచ్చిన జీవోఎంఎస్ నెంబర్ 4 వలన వీఆర్వోల క్యాడర్‌కు, ప్రమోషన్ చానల్‌కు అదే విధంగా మి గులు సిబ్బందిని వీఆర్వోలను నియమించేందుకు, వీఆర్వోలపై తీవ్రమైన ఒత్తిడిభారం పడుతుందన్నారు. అందకు నిరసనగా రాష్ట్ర, జిల్లా రెవెన్యూ అధికారుల సంఘం సూచనల మేరకు నిరసన కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు కిలారి సుబ్బారావు, అనిల్, రమేష్, బాబాజీ, సంతోష్, నారాయణ, సురేష్ పాల్గొన్నారు.



మార్కాపురంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గిద్దలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను బానిసలుగా మారుస్తున్న 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు థామస్ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని థామస్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మురళి, బాలయ్య, ఏసురత్నం పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని హైవేపై సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూరేలా కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా తెచ్చేందుకు చేసే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రూబెన్, నాగరాజు, బాలశేషయ్య, వెంకటేశ్వరరెడ్డి, ప్రకాశం, శారా, రైతు సంఘం నాయకులు సోమయ్య పాల్గొన్నారు.


పొదిలి : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లేబర్‌కోడ్ రద్దుచేయాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరెడ్డి, యోసు, సుబ్బయ్య, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆవుల సురేష్‌కు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కలు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ లోను కోసం దరఖాస్తులు

పొదిలి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీ కార్పొరేషన్ 50శాతం సబ్సిడీ లోను కోసం దరఖాస్తులు చేసుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 50శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుండగా బ్యాంకుల ద్వారా మరో 50శాతం లోను తీసుకోవాలని సూచించారు. నగరపంచాయతీ పరిధిలో మైనారిటీ యువతీ, యువకులు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోదలచిన వారు మే 25వ తేదీ లోపల సచివాలయం, (ఓబీఎంఎంఎస్) పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నగరపంచాయతీకి మొత్తం 41 యూనిట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

న్యాయం కోసం సెల్‌టవర్ ఎక్కిన యువకుడు


సెల్ టవర్‌పై ఉన్న సురేష్

ఎర్రగొండపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం గ్రామంలో ఆలేటి సురేష్ మంగళవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అక్కడే ఉన్న ఏఎస్ ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది వెళ్లి సురేష్‌ను సెల్ టవర్ నుంచి కిందికి దించి కాపాడారు. నెలకిందట ఆలేటి సురేష్ అతని స్నేహితులు సుబ్బారావు, బాలు ముగ్గు రు గొడవ పడ్డారు. అప్పట్లో సురేష్ పోలీసులకు ఫి ర్యాదు చేయగా సుబ్బారావుపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద హాజరుపరిచారు. గొడవ అనంతరం బాలు అనంతపురం జిల్లాకు వెళ్లినట్లు సమాచారం. అయితే బాలును అరెస్టు చేయలేదని, తనకు న్యాయం జరగలేదని సురేష్ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఏఎస్ఐ హామీతో కిందికి దిగాడు.

చోరీ కేసులో మహిళ అరెస్ట్

12.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేసిన ఓ మహిళను మార్కాపురం టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 12.7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు చోరీ వివరాలను వెల్లడించారు. కొమరోలు మండల కేంద్రానికి చెందిన మజ్జారి బాలవెంకటయ్య కుటుంబ సభ్యులతో కలిసి మార్కాపురం పట్టణంలో బంధువుల పెళ్లికి వెళ్లేందుకు ఈ నెల 18 సాయంత్రం ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మార్కాపురం చేరిన వెంటనే వారితో తెచ్చుకున్న లగేజీని చూసుకోగా బంగారు ఆభరణాలు ఉన్న సంచి కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన ఆయన వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు అన్ని కోణాల్లో వెదుకులాట ప్రారంభించారు. కంభం బస్టాండ్ వద్ద వారితో ప్రయాణించిన ఒక జంట దిగినట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా విచారించారు. సీసీ పుటేజీల్లో ఒక జంట బాధితులకు చెందిన బ్యాగుతో కంభం బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. బ్యాగును దొంగిలించిన మహిళ కోసం గాలించగా జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో నివాసముంటున్న దూదేకుల హుసేన్‌బీగా గుర్తించారు. మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. కేసును ఛేదించిన పట్టణ పోలీసులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించి, రివార్డ్‌ను అందజేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

తర్లుపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బ్రహ్మనాయుడు అన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని, బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి మోసగించేవారి మాటలు నమ్మొద్దన్నారు. కొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారినీ నమ్మొద్దన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సూచించారు.

ముఖాముఖి

వంద రోజుల పని కల్పిస్తాం

టి.వెంకటరావు, ఏపీవో, ముండ్లమూరు



ప్రశ్న: మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి?

జవాబు: మండలంలో 14,914 జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ప్రతిరోజు 5,700 మంది పనికి వెళ్తున్నారు.

ప్ర: ఉపాధి హామి పథకం ద్వారా ఎలాంటి పనులు చేపడుతున్నారు?

జ: ప్రస్తుతం సేద్యపు నీటి కుంటలు, పశువుల నీటి తొట్లతో పాటు చెరువులో పూడిక తీతలు, రైతుల పొలాలకు వెళ్ళే దారులకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపులు తదితర పనులు చేపట్టాం.

ప్ర: మండలంలో ఎన్ని గోకుల షెడ్లు మంజూరయ్యాయి? వాటిలో ఎన్ని నిర్మించారు?

జ: ప్రతి పంచాయతీలో ఒకటి నుంచి రెండు మూడు వరకు గోకుల్ షెడ్లు నిర్మించాం. ఒక్కో లబ్ధిదారుడికి రూ.45,500 చెల్లించాం. పశుపోషకులు ఎవరైనా ముందుకు వచ్చినట్లయితే ఎక్కువ స్థానంలో మంజూరు చేయిస్తాం.

ప్ర: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించారా?

జ: పల్లె పండుగ పేరుతో 32 పనులకుగాను రూ.3.50 కోట్లతో పనులు చేపట్టాం. మురుగు కాలువలు, సీసీ రోడ్లు, మెటల్ రోడ్లు నిర్మించాం.

ప్ర: నాలుగు వారాల నుంచి కూలీలకు ఉపాధి వేతనాలు అందడంలేదా?

జ: నాలుగు వారాల నుంచి బిల్లులు రాని మాట వాస్తవమే. మరో వారం రోజుల్లో బిల్లులు విడుదల అవుతున్నాయి. వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం.

ఆడపిల్లల పట్ల వివక్షత చూపొద్దు!

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, అసమానతలు చూపరాదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎమ్‌పీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని చింతలపాలెం పంచాయతీ మోట్రావులపాడు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా లింగ వివక్షత, బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షతో ఆడపిల్లలు సమాన అవకాశాలు, హక్కులు వనరులు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్యవివాహాలతో బంగారు బాల్యం కోల్పోతున్నారన్నారు. బాల్యవివాహాలు, లింగ వివక్షత నిర్మూలించాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో షేక్ అబీద, పి.అన్నమ్మ, ప్రమీల, కె.సుబ్బలక్ష్మి, రత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.4ను రద్దు చేయాలి

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 4ను తక్షణమే రద్దు చేయాలని వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు బి.కుమార్ డిమాండ్ చేశారు. ఈజీవోతో ఓవైపు పనిభారం, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వో పోస్టులు ఖాళీ కానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని, కోరుతూ వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ బీవీ రమణారావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల రేషలైజేషన్‌తో పనిభారం పెరుగుతందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులను సచివాలయాల నుంచి తప్పించి 2019కి పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానం లో తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు కేసీ వెంకటస్వామి, మండ్ల శ్రీను, మహ్మద్ రఫీ, షేక్ గరీబా, గాబ్రియేల్, జక్క సరస్వతి, పి.రమేష్, ఏ .సుధాకర్, ఖాజా రసూల్, ఖాజావలి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో నీటి కష్టాలు

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి ఎస్సీ కాలనీలో చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో పదిరోజుల నుంచి కాలనీవాసులు నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ నీరుకట్టు హరిప్రసాద్ సమకూర్చిన నీళ్ల ట్యాంకర్ నీటితో కాలనీ వాసులు నీటి అవసరాలను తీర్చుకొంటున్నారు. స్థానిక చర్చి వద్ద ఉన్న డీప్‌బోరు మరమ్మతులకు గురైన విషయాన్ని ఎంపీడీవో దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సంపూర్ణ పారిశుధ్య పనులు చేపట్టి పామూరును స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులో కార్యదర్శి అరవింద ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో కాలువల్లో పూడికను తొలగించారు. పట్టణంలో అవసరమైన చోట మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టాలని పువ్వాడి పేర్కొన్నారు. కార్యక్రమంలో అడుసమల్లి ప్రభాకర్‌చౌదరి, మన్నం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీ రూ.2లకు పడిపోయిన కరివేపాకు

» ఆందోళన చెందుతున్నరైతులు

ముండ్లమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కేజీ రూ.2లకు కరివేపాడు పడిపోయింది. దీంతో మండలంలో పలుగ్రామాల్లో కరివేపాకు సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పంట కోసం తెచ్చిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి రూ.పది వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. నిన్నమొన్నటి వరకు ఆశాజనకంగా ధరలు ఉండటంతో రైతులు ఆనందంగా ఉన్నారు. వారం క్రితం టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పలికింది. వారం కూడా తిరగక ముందే ఒక్కసారిగా ధర పడి పోయింది. కేజీ రెండు రూపాయలకే కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది రైతులైతే పొలంలోనే వదిలిలేస్తున్నారు.



పసుపుగల్లులో సాగుచేసిన కరివేపాకు తోటలు

మండలంలోని పసుపుగల్లు, ముండ్లమూరు, సింగనపాలెం, ఉల్లగల్లు, కెల్లంపల్లి, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, శంకరాపురం, పులిపాడు, నందమూరి నగర్ గ్రామాల్లో రైతులు కరివేపాకు తోటలు విస్తారంగా సాగు చేశారు. దాదాపు మండలంలో రెండు వందల నుంచి ఐదు వందల లోపు ఎకరాలు సాగు చేశారు. ఒక్క వారం రోజుల్లో ధరలు పాతాళానికి పడిపోవటంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మొదట్లో ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు వచ్చే ఏడాది సాగు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం

వీసీపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా వీసీపల్లి మండలంలోని వెంగళాపురం గ్రామసమీపంలో పాలేటిగంగ దగ్గర 36అడుగుల అభయాంజనేయస్వామి దేవస్థానం కమిటీ వారు ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల పోటీలను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దృఢమైన శరీరం, నడకలో రాజసం, పందెంలో పౌరుషంతో దేశం గర్వించదగ్గ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన చూస్తుంటే పండగ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. యాంత్రీకరణ లేని రోజుల్లో వ్యవసాయానికి అండగా నిలిచిన ఎడ్లను ప్రోత్సహిస్తూ ఈప్రాంత సంస్కృతిని ముందుకు తీసుకెళ్తున్న అభయాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కొంపల్లి మాలకొండయ్య అభినందనీయులన్నారు. ప్రస్తుత కాలంలో ఇలాంటి ఔత్సాహిక గ్రామీణ పోటీలు కరువయ్యాయని అన్నారు.

మంగళవారం నిర్వహించిన వ్యవసాయ విభాగం ఎడ్ల పోటీలలో కడపజిల్లా ఖాజీపేట మండలం రహమత్నాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇరగంరెడ్డి లక్ష్మీరెడ్డి, బాపట్ల జిల్లా ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన తనుబొద్ధి రవిశంకర్‌రెడ్డికి చెందిన ఎడ్లు 5113.3మీటర్లు లాగి మొదటి బహుమతి రూ.50,116 గెలుచుకున్నారు. పత్తిపాడు మండలం పెద్దగొడ్డపాడు గ్రామానికి చెందిన గరికపాటి వెంకట్ జీఎల్ఆర్ బుల్స్ 5002.7 మీటర్లు లాగి రెండో బహుమతి రూ.40,116 సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.



ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

బుధవారం జూనియర్ ఎడ్ల విభాగ ప్రదర్శన, గురువారం సీనియర్ ఎడ్ల విభాగ ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కొంపల్లి మాలకొండయ్య, వెల్లి కొండయ్య, గుదే నాగేశ్వరరావు, కొంపల్లి మధు, పరిమి ఈశ్వరరావు, వేమూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలు సమ్మె

» మూతబడిన విలేజ్ క్లీనిక్‌లు

దొనకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పేద ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువలో అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విలేజ్ క్లీనిక్‌లను ప్రవేశపెట్టింది. గ్రామ పంచాయతీల్లో సచివాలయాలకు అనుసంధానంగా విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను నిర్మించారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారిని దొనకొండ మండలానికి 14 మందిని ఎంపికచేసి మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా పోస్టింగ్‌లు ఇచ్చి ఒక్కో కేంద్రంలో నియమించారు. వీరు గ్రామాల్లోని హెల్త్ క్లీనిక్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే, ఉద్యోగం రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచాలని, తదితర సమస్యల పరిష్కారం నిమిత్తం గతనెల 24 నుంచి ఎంఎల్‌హెచ్‌పీలు ఆందోళన బాటపట్టారు. దీంతో క్లీనిక్‌లు మూతబడటంతో గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలందక అవస్థలు పడుతున్నారు.



దొనకొండలో మూతబడిన విలేజ్ క్లీనిక్

త్వరితగతిన గృహాలను నిర్మించుకోవాలి

» డీఈ కోటిరెడ్డి

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా గృహాలు నిర్మించుకొంటున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయిస్తుందని డీఈ కోటిరెడ్డి తెలిపారు. మండలంలోని ఇనిమెర్ల గ్రామంలోని ప్రభుత్వ లేఔట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ లేఔట్‌లో ఇంటి నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభించకపోతే లబ్ధిదారుల ఇంటి పట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. జూలై 12 తేది నాటికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 3 లక్షల గృహ ప్రవేశాల కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలో 874 గృహాలకు గాను ఇప్పటికి 401 గృహాలను పూర్తి చేసినట్టు చెప్పారు. మిగిలిన 473 గృహాల లక్ష్యాలను అధిక మించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, హౌసింగ్ ఏఈ రాజమోహన్‌రెడ్డి, ఏపీవో బి.మాల్యాద్రి, కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ కోటిరెడ్డి

విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు

» ఈఈ శ్రీనివాసులు

తాళ్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని దర్శి సబ్ డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం తూర్పుగంగవరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ సబ్‌స్టేషన్‌ల్లో పాడైపోయిన మెటీరియల్‌ను మార్చాలన్నారు. యార్డులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం జరుగకుండా నిరంతరం సరఫరా జరిగేలా చూడాలన్నారు. బిల్లులు సకాలంలో వసూళ్లు చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వినియోగించుకుని సోలార్‌విద్యుత్ ఉత్పత్తి చేసుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలన్నారు.



తూర్పుగంగవరం సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు

ప్రస్తుత రోజులకు అనుగుణంగా విద్యుత్తు లోడ్‌ను 50శాతం సబ్సిడీతో వాలంటరీ లోడ్ రెగ్యులేషన్ స్కీమ్ కింద క్రమబద్ధీకరించుకోవచ్చునని చెప్పారు. ఈపథకం త్వరలో ముగుస్తున్నందున వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమలో డిప్యూటీఈఈ రవికుమార్, సబ్‌ఇంజనీర్ ఇమ్మానియేల్‌బాబు,ఎల్ఐ వీపీఎస్ కాంతారావు, రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

తాళ్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా నియమితులైన మేడగం వెంకటేశ్వరరెడ్డిని ఎంపీపీ తాటికొండ శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎంపీపీ చాంబర్‌లో వెంకటేశ్వరరెడ్డిని ఎంపీపీ తాటికొండ శ్రీను, బి.ఓబుల్‌రెడ్డిలు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ శ్రేణుల సహకారంతో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్, పాపారావుల సహకారంతో మండల అభివృద్ధికి తోడ్పాడు నందిస్తానని తెలిపారు. పార్టీశ్రేణులు కూడా తనకు సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, గొల్లపూడి వేణుబాబు, రాచకొండ వెంకట్రావు, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, మారిశెట్టి హనుమంతరావు, మన్నేపల్లి సమర, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీ, నేతలు

'సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి'

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసేంతవరకు దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి అన్నారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం పట్టణంలోని స్థానిక మఖ్మీడాడి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.వీరనారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎన్.నారాయణమ్మ, షేక్ రసూల్, బి.మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తాటికొండ, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి

ప్రకాశం పంతులుకు నివాళి

తాళ్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలకులను ఎదురొడ్డి ముందుకుసాగిన ధీరశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికి ఆదర్శనీయులని ఎంపీపీ తాటికొండ శ్రీను అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర వహించి, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో దారా హనుమంతరావు, బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, మారిశెట్టి హనుమంతరావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, కార్యాలయ పర్యవేక్షకులు సానికొమ్ము సత్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠినచర్యలు



మారెళ్ళ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.కమలాకర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మారెళ్ళ, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కలసిమెలసి ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవలుపడి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించవద్దన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే తమకు తెలియ జేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని రాత్రుల సమయాల్లో ఆరుబయట నిద్రించేవారు ఇళ్లకు తాళాలు వేయటం మరచిపోవద్దన్నారు. ఇతర గ్రామాలకు వెళ్ళేవారు పక్కింటి వారికి చెప్పటంతో పాటు వీలైతే పోలీసు స్టేషన్‌లో తెలియ జేయాలన్నారు.

గ్రామాల్లో రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు ఎస్ఐ కమలాకర్ చెప్పారు. వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, పత్రాలు కలిగి ఉండాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి దేవాలయం వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందాలు నిర్వహిస్తున్నట్లయితే తమకు తెలియజేయాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రేమానిధి, కాశిరాజు పాల్గొన్నారు.

బంగారం షాపులో చోరీ

కనిగిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలోని బొడ్డుచావిడి వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డుచావిడి వద్ద ఉన్న శివ జ్యుయలర్స్‌లో 40గ్రాముల బంగారు వస్తువులు అపహరణకు గురయ్యాయి. షాపు యజమానులు అచ్చుత ఓంకారంగుప్తా, ఆయన భార్య పనిమీద తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లారు.




ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

అనంతరం గుప్తా అనారోగ్యంతో ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లాడు. షాపు వెనుకభాగంలో వీరు నివాసం ఉంటారు. ఈక్రమంలో షాపు కౌంటర్ టేబుల్‌పై ఉన్న అద్దం తొలగించి ఉన్నట్లు గుర్తించారు. దీంతో మిగతా వస్తువులు తీసుకుని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న తన భార్య వద్దకు వెళ్ళి జరిగిన విషయాన్ని తెలియజేశారు. వస్తువుల వివరాలు విచారించగా వాటిలో దాదాపు రూ.3.5 లక్షల విలువైన 40గ్రాములు బంగారు వస్తువులు దొంగతనం జరిగిందని తెలుసుకున్నారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాంలు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అపహరణ జరిగిన షాపు పక్కన ఓ చిన్న సందు ఉంది. అందులో నుంచి ఓమహిళ లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి, ఆదిశగా విచారణ చేపట్టినట్టు తెలుస్తుంది.

కార్మికుల హక్కులను కాపాడాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పామూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్స్ ద్వారా హక్కులను కోల్పోతున్న కార్మికులను ఆదుకోవాలని ఏఐటీయూసీ నాయకుడు సయ్యద్ మౌలాలి పేర్కొన్నారు. రైతు, కార్మిక, శ్రామికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక విధానాలకు నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. కూలీలకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ రంగసంస్థల ద్వారా కొనుగోలు చేయాలన్నారు.

అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాలపర్తి మస్తాన్‌రావు, వజ్రాల సుబ్బారావు, పి.రఘునాథరెడ్డి, ఆర్.సూరిబాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీఎస్‌పురంలో వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు, ఉప్పలపాడు, నల్లమడుగుల, అరివేముల సచివాలయాల్లో పంచాయతి కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఊసా వెంకటేశ్వర్లు, తిరుపతి రాజు, తులసీరావు, అజీద్‌బాషా, ఏసుదాసు, నారయ్య, రామయ్య, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

బాపట్ల జిల్లా వార్తలు

బుధవారం 21 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

21-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	26
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	34	26
చీరాల	34	26



డోర్ డెలివర్రీకి..

చెల్లుచీటి!

- ఇంటింటికీ సరుకుల పంపిణీ నిలిపివేత
- క్యాబినెట్ కమిటీ నిర్ణయంతో పాత పద్ధతికి స్వస్తి
- ఇకపై చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఎండీయూ వాహన సరఫరా విధానాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ- క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. సమావేశ అనంతరం వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తూ, గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు.

ఎండీయూపై ప్రజల్లో విముఖత

రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రకారం 25% మందికి నిత్యావసర సరుకులు అందకపోవడం, 26% మంది ఎండీయూ ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. దీంతో ప్రజల్లో విముఖత పెరిగింది. ప్రతి ఎండీయూ మూడు రేషన్ షాపులను ఇవ్వగా వారు నెలలో 15-17 రోజుల్లో మాత్రమే కవర్ చేస్తున్నారు. దీంతో కార్డుదారులకు సరుకులు అందడం లేదు. వాటిని దారి మళ్లించడంపై 288 కేసులు భారీగా నమోదయ్యాయి. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా 570 మంది ఆపరేటర్ల కొరత ఉంది. దీనికి తోడు ఈవిధానం కారణంగా ప్రభుత్వంపై రూ.353.81 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

● డోర్ డెలివరీతో వర్రీ..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17,30,835 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి 3,384 రేషన్ షాపులు అందుబాటులో ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో జిల్లాలో 850 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ప్రజల కష్టాలను తగ్గించకపోగా మరింత పెంచింది. కూలీ, నాలీ చేసుకునే నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు రేషన్ సరుకులే ఆధారం. గతంలో కూలీ పనులకు వెళ్లి వచ్చి సమీపంలో ఉన్న రేషన్ షాపుల్లో సరుకులు తెచ్చుకునేవారు. డోర్ డెలివరీ విధానంలో ఎండీయూ వాహనం తమ ఇంటికి వచ్చే రోజు కోసం కార్డుదారులు ఎదురు చూడాల్సి వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటి దగ్గర ఉంటే అదృష్టం.. లేదంటే ఇక అంతే! ఆ కారణంగా లబ్ధిదారులు పనులు మానుకుని ఇళ్లదగ్గర ఉండాల్సి వచ్చేది. దీంతో వారు పనిదినాలు నష్టపోయి, ఆదాయాలు తగ్గిపోయాయి. ఎండీయూ తమ వీధికి వచ్చినా, ఆ రోజు కోటా అయిపోతే మళ్లీ వారు మరుసటి రోజు కూడా పని మానుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు మండు టెండలో రోడ్ల మీద ఎండీయూ వాహనాల దగ్గర గంటల తరబడి నించోవాల్సి వచ్చేది. దీంతో ఎండీయూ విధానం రద్దుచేయాలన్న డిమాండ్ గత కొంత కాలంగా బలంగా ముందుకు వచ్చింది. తాజాగా కేబినెట్ తీసుకున్న నేపథ్యంలో కార్డుదారులకు ఈ కష్టాలు తప్పినట్లే!

ప్రభుత్వం వరమిచ్చినా..

కరుణించని సాఫ్ట్‌వేర్



దేవుడు కరుణించినా.. ఎవరో కరుణించ లేదన్న చందంగా మారింది నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ. రైస్ కార్డును అర్హులైన పేదలకు మరింత చేరువ చేస్తామని సంతోషంగా ప్రకటించిన పౌరసరఫరాల శాఖ దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సిన విషయాన్ని మాత్రం మర్చిపోయింది. సర్వర్ సమస్యలతో ఒక్కో దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. రోజు మొత్తమ్మీద రెండు మూడుకు మించి దరఖాస్తులు పూర్తి కావడం లేదు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు ప్రభుత్వం నెల రోజులు గడువు ఇచ్చింది. ఇప్పటికే అందులో రెండు వారాలు పూర్తయ్యాయి.

- రైస్ కార్డు దరఖాస్తుల ఆన్‌లైన్‌లో తీవ్ర జాప్యం
- రెండు గంటలకు ఒక అప్లికేషన్ మాత్రమే పూర్తి
- ఒక్కో సచివాలయంలో 100కు పైగా పెండింగ్
- సాఫ్ట్‌వేర్ పాతదే కావడంతో నిరాశ
- సమస్యాత్మకంగా వివాహ ధ్రువీకరణ పత్రం
- వాట్సప్ గవర్నెన్సూ నిరాశే
- ముంచుకొస్తున్న గడువు గండం


బాపట్ల, మే 20, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన హౌస్ హోల్డ్ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన తప్పులు ఇప్పుడు నిజమైన లబ్ధిదారులకు గుదిబండలా మారుతున్నాయి. కేవలం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి, పాత కార్డుల్లో పుట్టిన సంతానాన్ని చేర్చుకోవడానికి మాత్రం అవకాశం లభిస్తోంది. మిగిలిన 7 అంశాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో సర్వర్ మొరాయింపు కష్టాలు ఉదయం నుంచి రాత్రి వరకు లబ్ధిదారులను పడిగాపులు కాసేలా చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో సవరణలకు అసలు అవకాశమే ఇవ్వకపోవడం, అర్హులైన లబ్ధిదారులను కూడా రాజకీయ కక్షలతో తొలగించడం వంటి కారణాలతో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి నిరాశ తప్పడం లేదు.

పాత సాఫ్ట్‌వేర్‌తో కష్టాలు

పౌరసరఫరాల శాఖ పేదలకందించే రైస్ కార్డుల విషయంలో కొత్తవారికి అవకాశం కల్పించడం, మరో ఏడు అంశాలను సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే దీనికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను మాత్రం అప్‌డేట్ చేయలేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో విధించిన షరతులే ఇప్పుడూ వర్తిస్తున్నాయి. ఆరు అంచెల తనిఖీ విధానానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేషన్ కార్డు కోసం గత ప్రభుత్వంలో భూములు, వాహనాల విషయంలో పరిమితులు, విద్యుత్ వినియోగం యూనిట్ల పరిమితి వంటి వాటి ఆధారంగానే తీసుకున్న లబ్ధిదారుల అర్హతను ఇప్పుడూ నిర్ధారిస్తున్నారు. గతంలో కార్డుల్లో కోత విధించేందుకు వైసీపీ సర్కారు అనేక ఆంక్షలు పెట్టి.. చాలా కార్డులను తొలగించింది. దీంతో అర్హత ఉన్నా, చాలామంది పేద లు కార్డులు కోల్పోయారు. ఇప్పుడు అటువంటివారు దరఖాస్తు చేసుకుందామని చూస్తే మళ్లీ అవే షరతులు, అవే ఆటంకాలు వారికి రేషన్ కార్డు అందకుండా చేస్తున్నాయి.

● హౌస్‌హోల్డ్ సర్వేలో తప్పులు..

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి హౌస్‌హోల్డ్ సర్వే కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో పేర్ల నమోదు, ఇంటి నంబర్లు తప్పులు వేయడంతో ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. హౌస్ హోల్డ్ సర్వే వివరాలను డిలీట్ చేయడం, సవరించడం కుదరకపోవడంతో లబ్ధిదారులకు శాపాలుగా మారుతున్నాయి. సర్వేలో లోపాలు సవరించే అవకాశం కల్పిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది.



వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకో దానికి ప్రయత్నిస్తే.. ఆప్షన్స్ కనిపించని పరిస్థితి

వాట్సాప్ గవర్నెన్స్‌లో నో ఆప్షన్స్

కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 95523 00009 నంబర్‌కు కొత్త రైస్ కార్డుకు సంబంధించి ఏడు రకాల సేవలు అందుతాయని, ఈ నెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని ఆ శాఖ ప్రకటించింది. అయితే సేవను ఎంపిక చేస్తే ఇవేమీ రాకుండా, దీపం స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ వంటి కేవలం నాలుగు ఆప్షన్‌లు మాత్రమే వస్తున్నాయి. టోల్ ఫ్రీనంబర్ తెలుసుకుని వారికి కాల్ చేస్తున్నా స్పందన ఉండడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

* కూచిపూడికి చెందిన ఓ మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడు ఆమెకు ఒంటరి కార్డు తీసుకోవాలంటే ఎప్పు డో విడిపోయిన భర్త వచ్చి వేలిముద్ర వేయా లంట.
* 50 ఏళ్లు పైబడి ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పాత కార్డుల్లో ఉన్నవారికి ఇది వీలుకావడం లేదు. ఏ కార్డులో లేనివారికి అవకాశం లభిస్తోంది.
* నలుగురున్న కుటుంబంలో భార్య చనిపోయింది. ఆమెను డిలీట్ చేయాలని మరణ ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేస్తే, వారి పిల్లల ఆధార్ సీడింగ్ తప్పుగా నమోదైంది. దీంతో సింగిల్ పర్సన్‌ను డిలీట్ చేయటానికి వీలు కావటం లేదు.
* ఒకే రేషన్ కార్డులో అత్త, మామ, కొడుకు, కోడలు నలుగురున్నారు. ఆ కార్డు నుంచి కొడుకు, కోడలిని తొలగించాలంటే కోడలు రిలేషన్ దగ్గర ఎన్‌పి అని చూపిస్తోంది. వారి రిలేషన్ చూపడం లేదు. దీంతో వారి డిలీషన్ కూడా కుదరని పరిస్థితి.
* వివాహమైన వారు కొత్తగా రేషన్ కార్డు తీసుకునేందుకు.. వివాహ ధ్రువ పత్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. వివాహ నమోదు పత్రం నంబరు, ఫొటో ఇస్తేనే సర్వర్ తీసుకుంటోంది. దరఖాస్తు అప్‌లోడ్ అవుతోంది.

రెండు గంటలకో దరఖాస్తు

రేషన్ కార్డు కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే దాని స్థితిని తెలుసుకోడానికే రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలంటే కనీసం రెండు గంటలు పడుతోంది. ఉదయం 9 గంటలకే సచివాలయాల దగ్గర దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. గడువు తక్కువగా ఉండటం, ఈలోపే తమ దరఖాస్తు పూర్తిచేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పోటెత్తడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సర్వర్ మొరాయించకుండా చేయటం కానీ, గడువు పొడిగించటం వంటి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. సర్వర్ సమస్యతో రోజుకు కేవలం 7 నుంచి 10 దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేయగలుగుతున్నారు.



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం

- 2021 నుంచి 2024 వరకు అడ్డగోలు తవ్వకాలు
- జేపీ వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులివ్వాలి
- ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలపై, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు మరింత పెరగాలని, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుకరేవుల వద్ద అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే ఉపేక్షించేదిలేదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుకతవ్వకాల నిషేధం అమలులోకి వస్తుందన్నారు. ఈనేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్ళే రహదార్లను తొలగించాలని ఆదేశించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడే వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. 2021 నుంచి 2024 వరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీ సాక్ నివేదిక ఆధారంగా జేపీ వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్‌నోటీసులివ్వాలని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు. జువ్వలపాలెం-2 రేవులో 24.9హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కొరకు జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అలాగే గాజుల్లంక ఇసుకరేవులో 19వేల మెట్రిక్‌టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. ప్రజల అవసరాల కొరకు ఇబ్బందులు లేకుండా అన్నిచర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ ఏడీ రాజేష్, డీటీవో పరంధామరెడ్డి, కాలుష్య నియంత్రణబోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా.. పనులు జరిగేనా!

- కలెక్టరేట్ వేదికగా నేడు మూడో డీఆర్సీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా సమగ్రాభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర పోషించే డీఆర్సీ సమావేశాలు ఓ దశ, దిశ లేకుండా సాగు తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఇప్పటికే రెండు సమావేశాలు జరగగా, మూడోది కలెక్టరేట్ వేదికగా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి అధ్యక్షతన బుధవారం జరగనుంది. డీఆర్సీ సమావేశాలు ఏ దిశగా వెళుతున్నాయి .. అనే దానికి సూచికగా ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు) నిలవనుంది. కానీ, దీనిని ఓ మొక్కుబడి తంతుగా మార్చేసి మమ అనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఫలితాలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీని ఫలితమే ఏటీఆర్ రిపోర్టులు పేలవంగా దర్శన మిస్తున్నాయి.

గత డీఆర్సీ..ఏటీఆర్ పరిస్థితి ఇదీ

జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం ఎంత అనే అంశంతో పాటు కొనుగోలుపై గత డీఆర్సీలో చర్చ జరిగింది. సాగు విస్తీర్ణం గణాంకాలతో పాటు ప్రైవేటు కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తాయని ఏటీఆర్‌లో పొందుపరిచారు. నిజానికి ఇక్కడ ఏటీఆర్ రిపోర్టు ధర విషయంలో రైతాంగానికి చేసిన, చేయబోయే మేలు లేదా తీసుకోవాల్సిన చర్యలను వివరించాల్సి ఉంది. కానీ ఇందుకు భిన్నంగా అంకెలు వల్లేవేయడానికే అధికారులు ప్రాధాన్యమివ్వడం విస్తుగొలిపే విధంగా ఉంది. గత సమావేశాల్లోనే అనధికారికంగా అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు చేపట్టడంపై విస్తతంగా చర్చ జరిగింది. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికలు ఇవ్వాలని మత్స్య శాఖను రెవెన్యూ మంత్రి అనగాని ఆదేశించారు. కానీ, ఇప్పటి వరకు వాటిపై చర్యలేంటనే దానికి ఏటీఆర్‌లో సమాధానమే లేదు. డీఆర్సీలో లేవనెత్తే సమస్యల విషయంలో కేవలం 30 శాతం మాత్రమే నిర్మాణాత్మక పరిష్కారానికి నోచుకుంటున్నాయి. మిగిలిన వన్నీ గణాంకాలతోనే నింపేస్తున్నారు.

తొమ్మిది అంశాలతో డీఆర్సీ ఎజెండా ఖరారు

బుధవారం జరగనున్న డీఆర్సీ సమావేశం ఎజెండాలో తొమ్మిది అంశాలను అధికారులు చేర్చారు. ఇరిగేషన్, ఎంఎస్ఎంఈ, తాగునీరు, పర్యాటకం, హౌసింగ్, ఇళ్ల స్థలాల పట్టాలు, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ పనులతో పాటు బర్లీ పొగాకు దర అంశం కూడా డీఆర్సీలో చర్చకు జరగనుంది. ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మంత్రులు అనగాని, గొట్టిపాటితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

బర్లీ బేల చూపులు

- కొనసాగుతున్న పొగాకు రైతుల కష్టాలు
- అకాల వర్షాలకు మరింత కుదేలు
- 80 శాతం దిగుబడులు అన్నదాతల వద్దే
- గిట్టుబాటు ధర కోసం రైతు పోరుబాట
- నేటి డీఆర్సీలో బర్లీ కష్టాలపై కీలక చర్చ

(బాపట్ల, పర్చూరు-ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు రైతుల కడగండ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దిగుబడులను కొనే దిక్కు లేక రైతులు బేలగా ప్రభుత్వం వైపు చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలేవీ కూడా క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించడం లేదు. గడచిన వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు బర్లీ రైతును మరింతగా కుంగదీశాయి. నిల్వ ఉంచిన బేళ్ల కిందకు వర్షపు నీరు చేరడంతో పొగాకు నాణ్యతపై ప్రభావం చూపనుందని రైతులు వాపోతున్నారు. బర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే ప్రయత్నాలు నెల రోజులుగా జరుగుతూనే ఉన్నాయి. పలు దఫాలుగా పొగాకు రైతుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష చేపట్టింది. కానీ, అన్నదాతలకు ఎటువంటి ప్రయోజనం ఇంతవరకు చేకూరలేదు. రెండు వారాల కిందటే బర్లీ సాగు చేసిన పర్చూరు మండల కొలు రైతు బలవంతంగా ఉసురు తీసుకోగా, మరొక రైతు చావు అంచుల దాకా వెళ్లి వచ్చారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయంలో కంపెనీలను అదే పనిగా ప్రభుత్వం ఆదేశిస్తున్నా అటు వైపు నుంచి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడడం లేదు. ధర మీద ఆశలు వదిలేసుకున్న రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటను పొలానికి ఎరువు వేసే వరకు పరిస్థితి దిగజారింది.



పొగాకును కొనుగోలు చేయాలంటూ పర్చూరులో ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు, అన్నదాతలు

ఉమ్మడి జిల్లాలో 96 వేల ఎకరాలు...

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 96 వేల ఎకరాల వరకు బర్లీ పొగాకు సాగవగా, ఒక్క బాపట్ల జిల్లాలోనే 70 వేల ఎకరాల వరకు బర్లీ బాట రైతాంగం పట్టింది. మొత్తం 6 లక్షల క్వింటాల వరకు దిగుబడి వస్తుందనే అంచనాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 50 వేల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌లోకి వెళ్లింది. మిగిలినదంతా కూడా రైతుల వద్దనే నిల్వ ఉంది. అందినకాడికి పొగాను తెగనమ్ముకుందాం అనుకున్నా... గతేడాది క్వింటా గరిష్ఠంగా రూ.16 వేల వరకు పలికిందని ఇప్పుడు రూ.7 వేలకు అడిగే వారు లేరని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అదే నిర్లక్ష్యం..రైతుల ఆందోళన..

పొగాకును బోర్డు ద్వారా కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మొత్తం దిగుబడులను కంపెనీలు కొనే విధంగా చూస్తామన్నారు. ఈ ప్రకటన తర్వాత ఒక్క జీపీఐ సంస్థ మాత్రం రైతుల నుంచి అరకొరగా పొగాకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పర్చూరు, కారం చేడు మండలాలతో పాటు అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగలూరు మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గుంటూరులోని పొగాకు బోర్డు చైర్మన్‌తో భేటీ అయి న్యాయం చేయాలని కోరారు. బుధవారం జరిగే డీఆర్సీ సమావేశంలో తొలుత ఖరారు చేసిన ఎజెండాల్లో ఎనిమిది అంశాలే ఉండగా బర్లీ పొగాకుకు చోటు దక్కలేదు. ఎమ్మెల్యే ఏలూరి సూచనతో బర్లీ పొగాకు ధర అంశాన్ని కూడా ఎజెం డాలో తొమ్మిదో అంశంగా అధికారులు చేర్చారు. డీఆర్సీ సమావేశంలో ఈ అంశమే కీలకంగా వాడీవేడి చర్చ జరగనుంది.



మీ నమ్మకాన్ని విశ్వాసాన్ని నిలబెట్టుకుంటా

ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : "మీ అభిమానం, నమ్మకం నాపై ఉంచిన విశ్వాసమే నన్ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా మూడోసారి 24 వేల మెజారిటీతో గెలిపించారు. అందరి అంచనాలను నిజం చేస్తూ పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతా, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా, ఎన్‌టీఆర్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మంత్రి లోకేష్ సహకారంతో పార్టీ సైనికునిగా, ప్రజలకు సేవకునిగా పనిచేస్తా" నని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చెప్పారు. మంగళవారం నియోజకవర్గ మహానాడు మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగింది. తొలుత ఎమ్మెల్యే ఏలూరి దివంగత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఎగురవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తరువాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడారు. దేశంలో ప్రధానమంత్రి మోదీ తర్వాత అంతటి పేరు ప్రఖ్యాతులున్న సీఎం చంద్రబాబు అని, ఆయన అంటే ఒక బ్రాండ్ ఇమేజ్ అని చెప్పారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమనిధి ఏర్పాటుచేసి, వారి బాగోగులను చూస్తున్న మంత్రి లోకేష్ అండదండలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళతానన్నారు. నియోజకవర్గంలో 59 వేల మంది సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు.



హాజరైన నాయకులు ,కార్యకర్తలు

మహానాడులో చేసిన తీర్మానాలు

మహానాడులో నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు 20కు పైగా చేసిన తీర్మానాలను ప్రకటించారు. వాటిలో ముఖ్యంగా మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, నివేశన స్థలాలు, ఇళ్ల నిర్మాణం చేపడతామని, మోటుపల్లి సముద్రతీర ప్రాంతం పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని, బకింగ్ హాం కెనాల్ అభివృద్ధి పర్చూరు లేదా మార్టూరులో నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి, మూడు వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు కృషి చేసే వి.దంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

నల్లబర్లీని పూర్తిగా కొనుగోలు చేయాలి

• పలు మండలాల్లో రైతుల ధర్నాలు • తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

పర్చూరు/కారంచేడు/పంగులూరు/మార్టూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు తక్షణమే కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతుసంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం, కౌలు రైతుసంఘం ప్రతినిధులు స్థానిక రైతులతో కలసి పంగులూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ బర్లీ సాగును ప్రోత్సహించిన కంపెనీలు కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. పొగాకు కంపెనీలు పూర్తిగా కొనుగోలు చేయాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ధర్నా శిబిరం వద్దకు వచ్చిన తహసీల్దార్ సింగారావు రైతుసంఘం ప్రతినిధులతో సమస్యను చర్చించారు. అనంతరం జీపీఐ కంపెనీ ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడి పొగాకు రైతుల ఇబ్బందిని గుర్తించి, కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. కంపెనీ ప్రతినిధితో నాగబోయిన రంగారావు మాట్లాడుతూ రైతులు పండించి నిల్వ ఉంచిన పొగాకు కంపెనీలు కొనుగోలు చేయాలని, పంగులూరు లేదా ఇంకొల్లులో కేంద్రంగా పొగాకు కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. బర్లీ పొగాకు 75 మిలియన్ కేజీలు ఉందని, అధికారిక లెక్కలు చెబుతుంటే, ప్రభుత్వం 20 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పడం విడ్డూరంగా ఉందని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌బాబు చెప్పారు. కంపెనీలు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. నల్లబర్లీ పొగాకు కంపెనీల ద్వారాకాని, మార్క్‌ఫెడ్ ద్వారాకాని కొనుగోలు చేయాలని కోరుతూ తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి తలపనేని రామారావు, వినోద్, ఆదుంసాహెబ్, పంగులూరు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పర్చూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు



ధర్నాలో కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న నాగబోయిన

• యద్దనపూడి మండల తహసీల్దారు కె రవికుమార్‌కు రైతు సంఘం నాయకులు ఒక వినతిపత్రం అందజేశారు. పొగాకు కొనుగోలు చేయాలంటూ నిరసన తెలిపిన కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, ఈదల శ్రీను, వీరవల్లి కృష్ణ మూర్తి, వై హనుమంతరావు, వై శేషాద్రి పాల్గొన్నారు.

• పర్చూరు బొమ్మల సెంటర్‌లో పొగాకు కొనుగోళ్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి చింతలపూడి గంగయ్య, సీపీఎం నాయకులు మత్తే డేవిడ్, షేక్ రహీం, రైతులు పాల్గొన్నారు.

• కారంచేడులో రైతు సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని రైతులతో కలసి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండయ్య, పి.ఏడుకొండలు, శ్రీనివాసరావు, ఆవుల మంద వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పొగాకు బోర్డు చైర్మన్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

● మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయండి ● ప్రభుత్వానికి నివేదక అందించిన సాంబశివరావు



బోర్డు చైర్మన్ యశ్వంత్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : టుబాకో బోర్డ్ చైర్మన్ సిహెచ్. యశ్వంత్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. నల్లబర్లీ పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కంపెనీలు కొనుగోలు చేయకపోవటంపై ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి ఆ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో భేటీ నిర్వహించి పొగాకు కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయినా కంపెనీలు పంట కొనుగోలు చేయకపోవటంతో ఎమ్మెల్యే ఏలూరి పట్టువిడవకుండా వివిధ మార్గాల ద్వారా కంపెనీలతో ప్రభుత్వం పై నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నారు. పొగాకు సమస్యపై ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వానికి ఒక ప్రత్యేక నివేదిక సైతం అందజేశారు. ఈఅంశంపై పంటల కొనుగోలుకు సంబంధించి మంత్రుల కేబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వాన్ని కోరారు. క్యాబినెట్ కమిటీ సమావేశంలో పొగాకు కొనుగోలుకు సంబంధించి కంపెనీలకు కొంత సమయం ఇచ్చి చూద్దామని, ఆ తర్వాత ఏమి చేయాలో నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిసింది. పొగాకు రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏలూరి తెలిపారు.

రాజంపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

దర్శి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దయింది. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు విచారణలో తేలటంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజంపల్లి పంచాయతీలో నిధులను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కనిగిరి డీఎల్‌పీవో హనుమంతరావు విచారణ జరిపి రూ.29.47 లక్షల నిధులు నిబంధనలకు విరుద్ధంగా మార్చుకున్నట్టు జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చారు. కొన్ని పనులకు నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకుండా తన కుమారుడి అకౌంట్‌లోకి నిధులు మళ్లించినట్లు డీఎల్‌పీవో పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలటంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు ఇచ్చినట్టు ఈవోఆర్డీ సుధాకర్ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో మహిళ అరెస్ట్

● 12.7 తులాలు రికవరీ

మార్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : బం గారు ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేసిన ఓ మహిళను మార్కాపురం టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 12.7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు చోరీ వివరాలను వెల్లడించారు. కొమరోలు మండల కేంద్రానికి చెందిన మజ్జారి బా లవెంకటయ్య కుటుంబసభ్యులతో కలిసి మార్కాపురం పట్టణంలో బంధువుల పెళ్లికి వెళ్లేందుకు ఈ నెల 18 సాయంత్రం ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మార్కాపురం చేరిన వెంటనే వారితో తెచ్చుకున్న లగేజీని చూసుకోగా బంగారు ఆభరణాలు ఉన్న సంచి కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన ఆయన పోలీ స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్సైలు సైదుబా బు, రాజమోహన్ రావు అన్ని కోణాల్లో వెదుకులాట ప్రారంభించారు. కంభం బస్టాండ్ వద్ద వారితో ప్రయాణించిన ఒక జంట దిగినట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా విచారించారు. సీసీ పుటేజీల్లో ఒక జంట బాధితుల కు చెందిన బ్యాగుతో కంభం బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. బ్యాగును దొంగిలించిన మహిళ కోసం గాలించగా జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో నివాసముంటున్న దూదేకుల హుసేన్ బీగా గుర్తించారు. మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. కేసును ఛేదించిన పట్టణ పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించి రివార్డ్‌ను అందజేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించిన ఫ్యాప్టో ప్రతినిధులు

అద్దంకిటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో నాయకులు చర్చించారు. మంగళవారం ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా చేపట్టబోయే ధర్నా కార్యక్రమం గురించి సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతోపాటు తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటుకు వ్యతిరేకంగా, ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం మాధ్యమాన్ని కొనసాగించాలని, మెడల్ ప్రైమరీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఉన్నత పాఠశాలలో అదనపు సెక్షన్‌ను 45కు ఇవ్వాలని, ఎస్‌జీటీలకు మాన్యూవల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 21న ఒంగోలులోని డీఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలాది నాగరాజు, జె. బాబురావు, మల్లికార్జునరావు, రామారావు, పూర్ణచంద్రరావు, ఎలీషా, అంకయ్య, సుబ్బారావు, రవిచంద్ర, కోటేశ్వరరావు, రాఘవయ్య, రాజశేఖర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఫ్యాప్టో నాయకులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

● యూనియన్ నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లుగా పనిచే స్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ప లువురు కోరారు. ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లా యీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి పెం ట్యాల కల్పన ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కేవలం రూ.7,870 వేతనంతో గత తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న వాహనడ్రైవర్లకు కనీస వేతనాలు అ మలు చేయడం లేదన్నారు. వైద్యఆరోగ్యశాఖలో నిరంతరం పనిచేస్తున్న వాహన డ్రైవర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం పేరుతో వెట్టిచాకిరి చేపిస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, నాయకులు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు

టీచర్ల సంఘాలతో చర్చలు సఫలం

నేటి డీఈవో కార్యాలయ ముట్టడి వాయిదా

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల కేటాయింపు, బదిలీలకు సంబంధించి వివిధ అంశాలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సోమ, మంగళవారాల్లో విద్యాశాఖ కార్యదర్శి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడిని తాత్కాలికంగా వాయిదా వేశారు. మొత్తం 15 డిమాండ్లతో టీచర్ల సంఘాలు చర్చలకు వెళ్లగా మెజార్టీ డిమాండ్లకు అధికారుల స్థాయిలోనే పరిష్కారం లభించడంతో ఆందోళనను విరమించారు. టీచర్ల బదిలీలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఐక్యవేదిక నాయకుల డిమాండ్ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను ఆన్‌లైన్‌కు బదులుగా మాన్యువల్‌గా నిర్వహించేందుకు అధికారులు అంగీకరించారు. ప్రభుత్వానికి, నాయకుల మధ్య అంగీకారం కుదరడంతో బుధవారం బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సిద్ధం చేశారు. ఆమోదించిన డిమాండ్లు ఇవీ.

• రేషనలైజేషన్‌లో సీనియర్ టీచర్ తప్పనిసరి అయితే రేషనలైజేషన్ పాయింట్లు ఇస్తారు.
• హైస్కూళ్లలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండవ సెక్షన్ ఇస్తారు
• పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు
• ఉన్నత పాఠశాలల్లోని ప్రాథమిక పాఠశాలలను సపరేట్‌గానే పరిగణిస్తారు.
• హైస్కూళ్లలో వారానికి 32 పీరియడ్ల పనిభారం పెరగకుండా చూస్తారు
• ప్రస్తుతం స్టడీ లీవ్‌లో ఉండి ఆగస్టు 31లోపు జాయిన్ అయ్యే వారి స్థానాలను ఖాళీలుగా చూపించరు
• బదిలీలకు అన్ని ఖాళీ పోస్టులు చూపిస్తారు
• మోడల్ ప్రైమరీ స్కూళ్లను పీఎస్ హెచ్‌ఎంలుగా 1,382 మంది ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ ఇస్తారు
• మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులు 120 మంది దాటితే అదనంగా మరో ఎస్జీటీ పోస్టు ఇస్తారు.
• రెండుసార్లు పునర్విభజనకు గురైన టీచర్లకు 7 పాయింట్లు ఇస్తారు
• ఇతర మేనేజ్‌మెంట్లలో ఒక పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తిచేసిన టీచర్లు తమ సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లకు వెళ్లాలి.
• ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 20 దాటితే 2వ పోస్టుల ఇస్తారు.
• ఐక్యవేదిక నాయకులతో కుదిరిన ఒప్పందం మేరకు ప్రభుత్వం బదిలీల మార్గదర్శకాల్లో సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది.



వ్యక్తి అదృశ్యంపై కేసు

మద్దిపాడు, మే 20(ఆం.ధ్రజ్యోతి): మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. షేక్ కరీముల్లా గత 16 సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఇంటి నుంచి అప్పుడప్పుడు వెళ్లి కొద్దిరోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తూ ఉండేవారని, ఇదేక్రమంలో 2024 ఆగస్టులో బయటకు వెళ్లిన అతను ఇంతవరకు తిరిగి రాలేదని ఆయన భార్య షేక్ మొగల్‌జాన్‌బి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శివరామయ్య వెల్లడించారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. మార్టూరుకు చెందిన పంతంగి శ్రీనివాసరావు, పంతంగి ఏడుకొండలు బైక్‌పై ఒంగోలు వెళ్లి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా టిప్పర్ అడ్డువచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో వారికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అవీఇవీ

అరబిందో నుంచి భవ్యకు 108 వాహనాలు అప్పగింత

చీరాలలో వాహనాలను పరిశీలించిన ప్రతినిధులు



108 వాహనంలో పరికరాలు పరిశీలిస్తున్న భవ్య సంస్థ ప్రతినిధులు

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో సంస్థ నుంచి బీహెచ్‌ఎస్‌పీఎల్(భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్) సంస్థకు 108, 104 వాహనాల నిర్వహణ బాధ్యతలను మళ్లిస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే అందుకు సంబంధించిన ఒప్పందాలు కూడా జరిగాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 వాహనాలు, 1 నియోనటల్(చిన్నారులకు సంబంధించిన) వాహనం, అదనపు 108 వాహనం మొత్తం 27 వాహనాలపై అధికారులు ఆడిట్ చేస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం చీరాల ఏరియా హాస్పిటల్ పరిధిలో వాహనాన్ని పరిశీలించారు. వాహనం పని తీరు, అందుబాటులో ఉన్న పరికరాలను తనిఖీ చేశారు. బండి కండిషన్ చెక్ చేశారు. సిబ్బంది యథా స్థానాల్లో పని చేస్తారని అందుకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న 104 వాహనాలు 33ను ఈనెల 16నుండే భవ్య సంస్థ స్వాధీనం చేసుకుంది. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ బాలకృష్ణ, 104 జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ అశోక్, పైలట్‌లు, ఈఎంటీలు పాల్గొన్నారు.

పీఎంజేఏవైతో నగదు రహిత వైద్య సేవలు



పీఎంజేఏవై కార్డులు నమోదు చేస్తున్న వైద్యాధికారి

చినగంజాం, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనతో దేశంలో ఎక్కడైనా నగదు రహిత ఆరోగ్య సేవలు పొందవచ్చునని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే కీర్తిసరోజ్, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌లు చెప్పారు. మండలంలోని సంతరావూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేదప్రజలు పీఎంజేఏవై కార్డులను సద్వినియోగం చేసుకొని ఐదు లక్షల రూపాయిల వరకు కార్పొరేటు వైద్యశాలలో వైద్యసేవలు పొందవచ్చునని చెప్పారు. 500 మందికి ఆన్‌లైన్‌లో పీఎంజేఏవై కార్డులను నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే కృపారావు, పీహెచ్‌సీ హెచ్‌ఈవో వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, మాధవి, వరదానం, హెల్త్ అసిస్టెంట్ జీ.వి.జయప్రసన్న, ఏఎన్‌ఎంలు శారద, శాంతి, సునీత, యశోద, శిరీష పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు, హద్దురాళ్లు ఏర్పాటు



హద్దు రాళ్లు వేస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో గ్రంథాలయం భవనం నిర్మాణానికి ఇటీవల రెవెన్యూ అధికారులు 10 సెంట్లు స్థలం కేటాయించారు. ఎన్‌ఎస్‌పీ కార్యాలయం ఆవరణలో స్థలం కేటాయించగా మంగళవారం రెవెన్యూ, గ్రంథాలయ సంస్థల అధికారులు, ఎన్‌ఎస్‌పీ సిబ్బంది సమక్షంలో హద్దురాళ్లు వేశారు. గ్రంథాలయం భవనానికి స్థలం కేటాయింపునకు సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రంథాలయ సంస్థ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మి, రిటైర్డ్ లైబ్రరీయన్ సుగుణరావు, వసుంధర దేవి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మన్నం త్రిమూర్తులు, దివాకర్‌దత్తు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ దేవపాలన, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పల్లెపాటి పేరయ్య, జ్యోతి చంద్రమౌళి, గోవాడ శ్రీకాంత్, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలు

పలు కమిటీల్లో జిల్లా నేతలకు స్థానం

మంత్రి స్వామి కన్వీనర్‌గా రక్తదాన, మెడికల్ క్యాంపు కమిటీ

ఒంగోలు మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో కడపలో జరగనున్న టీడీపీ మహానాడు నిర్వహణలో జిల్లాకు చెందిన పలువురు నేతలకు కీలక బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కడప నగర శివారులో టీడీపీ మహానాడు జరగనుంది. భారీగా దానిని నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించి తదనుగుణ ఏర్పాట్లను అధిష్ఠానం పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈక్రమంలో మహానాడు విజయవంతం కోసం 19 కమిటీలను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలను ఆ కమిటీల్లో నియమించారు. అందులో పలు కమిటీల్లో జిల్లాకు చెందిన ముఖ్య నాయకులను నియమించారు. మొత్తం 19 కమిటీలకు ఒక్కొక్క కమిటీకి ఒక రాష్ట్ర స్థాయి ముఖ్యనేత కన్వీనర్‌గా అవసరాన్ని బట్టి ఒకరిద్దరు కోకన్వీనర్‌లుగా పలువురు నాయకులను సభ్యులుగా నియమించారు. అందులో వైద్యులు ప్రధానంగా నడిపించే రక్తదాన, మెడికల్ క్యాంపుల కమిటీకి కన్వీనర్‌గా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని నియమించారు. అలాగే వైద్యులైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీలను సభ్యులుగా నియమించారు. అలాగే అత్యంత కీలకమైన తీర్మానాల కమిటీలోనూ మంత్రి డాక్టర్ స్వామిని నియమించారు. మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా ఉన్న వసతి ఏర్పాట్ల కమిటీకి జిల్లాకు చెందిన యువ నేత మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణను కోకన్వీనర్‌గా నియమించారు. అలాగే భోజనాల ఏర్పాట్ల కమిటీలోనూ సభ్యునిగా సత్య ఉన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మరో ప్రధానమైన ఆర్థిక వనరుల కమిటీలో సభ్యునిగా నియమించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ కన్వీనర్‌గా జన సమీకరణ కమిటీ ఏర్పాటు చేయగా అందులో సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డిలను నియమించారు. సాంస్కృతిక వ్యవహారాల కమిటీలో ఒంగోలుకు చెందిన రాష్ట్ర కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్విని నియమించారు. ఆయా కమిటీ సభ్యులు అన్ని జిల్లాల పార్టీ నేతలతో సమన్వయం చేసుకొని మహానాడు విజయవంతంగా జరగడానికి కృషిచేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పర్చూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని వైజంక్షన్‌లో వేంచేసిన శ్రీ అభయాంజనేయస్వామి 92అడుగుల విగ్రహ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకే ప్రభుత్వ పథకాలు

పంగులూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : కౌలు రైతు గుర్తింపు కార్డుదారులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తహసీల్దార్ పి.సింగారావు చెప్పారు. మండలంలోని అలవలపాడు, తూర్పుతక్కెళ్లపాడు గ్రామాలలో మంగళవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో సుధాకర్, వీవోఏ ఫిలిప్, సునీత, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది


చందలూరులో తెరుచుకోని రైతు సేవాకేంద్రం తలుపులు

పంగులూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు సచివాలయం పరిధిలో రైతు సేవాకేంద్రం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి తమ పేర్లు రెన్యూవల్ చేసుకునేందుకు తాము మంగళవారం కార్యాలయానికి చేరుకున్నా 10.55 వరకు తలుపుల తెరుచుకోలేదని రైతులు తెలిపారు. రైతు సేవాకేంద్ర సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూఫ్ టాప్ సోలార్‌పై అవగాహన కల్పించాలి

బల్లికురవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : గృహాలలో రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రధాన మంత్రి సూర్యఘర్ మఫ్త్ బిజ్లీ యోజనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సోలార్‌ను ఏర్పాటు చేసేలా రాయితీలు ఇస్తోందని, అలానే ప్రజలకు బ్యాంకు ద్వారా రుణాలను కూడా ఇస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ మూడు వందల యూనిట్ల విద్యుత్‌ను తయారు చేసేలా ఈ పథకం పని చేస్తుందని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని గుర్తించిన పోలీసులు

ఈపూరుపాలెం(చీరాల), మే 20 (ఆం ధ్రజ్యోతి) : వాడరేవు సముద్ర తీరంలో కుటుంబ సభ్యులతో స్నానాలు చేస్తున్న వారిని ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈవ్‌టీజింగ్ చేసిన విషయం పాఠకులకు విదితమే. వారిని నిలదీసిన వ్యక్తిపై కూడా వారు దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో ఈపూరుపాలెంలో నమోదైన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అల్లరి మూకలు చిలకలూరిపేటకు చెందిన వారుగా గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా స్థానికుల పూచికత్తుతో బుధవారం వచ్చేవిధంగా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది.

108 కలశాల జలంతో అభిషేకం



కలశాలతో దేవాలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, మహిళలు, రాతి మండపం దాతలను సత్కరిస్తున్న ఈవో, పూజారులు

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం విమాన శిఖరానికి పూజలు

రాతి మండపం నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలకు సత్కారం

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం విమాన శిఖరానికి మంగళవారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. సోమవారం మహాకుంభాభిషేకం జరగగా మంగళవారం ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు 108 మంది మహిళలతో కలిసి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం విమాన శిఖరానికి అభిషేకంచేశారు. కలశయాత్రలో పాల్గొన్న పలువురు మహిళలు మంగళవారం విమాన శిఖరం జలాభిషేకంలో పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రాతి మండపం నిర్మాణానికి సుమారు 130 మంది లక్ష రూపాయలకు పైగా విరాళాలు అందజేయగా మంగళవారం 70 మంది దాతల కుటుంబాలకు స్వామి దేవాలయంలో ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహింపచేసి అనంతరం సత్కరించి, స్వామి ఫొటో అందజేశారు. మహాకుంభాభిషేకం పూర్తయిన తరువాత మొదటి మంగళవారం కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.


ప్రసన్నాంజనేయస్వామి

అంగరంగ వైభవంగా స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల


స్వర్ణ(పర్చూరు), మే 20 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసేందుకు ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలో వెలసిన స్వర్ణమ్మ తల్లికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని గ్రామ పూర్వీకులు చెబుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అధికారులు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కారంచేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి అమ్మవారు


ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించిన దృశ్యం

రేపు వీరాంజనేయస్వామి 38వ తిరునాళ్లు

మార్టూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై వేంచేసి ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి 38వ తిరునాళ్ల మహోత్సవాలను గురువారం నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దండా వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో సోమవారం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం భక్త సమాజం వారిచే అఖండ హరేరామనామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు. బుధవారం ఉదయం శ్రీహనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నారు. ఇక చివరిరోజు గురువారం శ్రీసువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం ఎడ్ల బలప్రదర్శన, కోలాటం ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు దండా వీరాంజనేయులు తెలిపారు.


అలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి విగ్రహం


కొణిదెనలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయం

నేడు రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల

బల్లికురవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న రామలింగశ్వరస్వామి 16వ వార్షిక తిరునాళ్ల బుధవారం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్థులు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారని, దేవాలయ కమిటీ తరపున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు కోరారు.

అందరికీ ఆదర్శనీయులు ఆంధ్రకేసరి


నివాళులర్పిస్తున్న పలు సంఘాల ప్రతినిధులు

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : నిస్వార్థ దేశభక్తిని, త్యాగనిరతిని ధైర్య సాహసాలు కలిగి అందరికీ ఆదర్శనీయులు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి చెప్పారు. మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి కార్యక్రమం అద్దంకిలోని ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లారోడ్డులోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాష్యం స్కూల్‌లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులుతో తనకు ఉన్న అనుబంధాన్ని, చేసిన సేవలను సుభాషిణి వివరించారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, కోశాధికారి ఊటుకూరి రామకోటేశ్వరరావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించుకోవాలి

పంగులూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ వైద్యశాల ఫిజియోథెరపిస్ట్ వెంకటరమణ చెప్పారు. పంగులూరు మండల కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు చిట్కాలు, సూచనలు తెలియజేశారు. ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోఆర్డీ సుమంత్, సూపరింటెండెంట్ రమేష్, పంచాయితీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటరమణ

అటు మద్రాసోళ్లు.. ఇటు లైసెన్స్ లేనోళ్లు...!

చీరాల సముద్ర తీరంలో నిషేధ కాలంలో అక్రమంగా చేపల వేట

భవిష్యత్తులో మత్స్య సంపద వృద్ధికి శరాఘాతం

నామమాత్రంగా అధికారుల తనిఖీలు

చర్యలు తీసుకోవాలని వినతులు


వాడరేవు సముద్రతీరం

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం తీరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మత్స్య సంపద వృద్ధి చెందే సమయం కావడంతో ఈ సమయంలో మత్స్యకారులు వేటను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. జిల్లాలో సుమారు 75 కిలోమీటర్ల తీరం ఉండగా, అందులో వేట సాగిస్తూ జీవనం గడుపుతున్న మత్స్యకార కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి.

సుమారు 40 మంది అనధికార వేట

మత్స్య సంపద వేటతో జీవనాధారం సాగిస్తున్న వారి పరిస్థితి ప్రస్తుతం అయోమయంలో పడింది. అప్పుడప్పుడు అకస్మాత్తుగా మద్రాసీయులకు చెందిన ట్రావెలర్ బోట్లు ఆంధ్రా పరిధిలోని తీరంలో అనధికారంగా చొరబడి వేట సాగిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో గుర్తించి నిలదీసిన మత్స్యకారులపై దాడులకు పాల్పడటమే కాకుండా వలల కూడా లాక్కెళ్లిన ఉదంతాలు తెలిసిందే. దీంతో స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు ఇటీవల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి అందజేశారు. ఈనేపథ్యంలో హోం మంత్రి విషయాన్ని సంబంధిత అధికారులకు సూచనలు కూడా చేశారు. తాజాగా స్థానికంగా లైసెన్స్‌లు లేని మోటారు బోటు మత్స్యకారులు సైతం తామేం తక్కువ కాదంటూ ఇష్టారీతిగా తీరంలోకి చొరబడి అక్రమంగా వేట సాగిస్తున్నారు. ఈ తరహా బోట్లు సుమారు 40 మంది తీరంలోకి వెళుతున్నట్లు సమాచారం. అసలే సంధి కాలం, పైగా అనధికార బోట్లు.. అయినా కూడా విచ్చలవిడిగా వేట సాగిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకార సంఘాల నాయకులు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అనధికార వేటను గుర్తించారు. వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఇలా అక్రమంగా చేపల వేట వల్ల సముద్రంలో మత్స్య సంపద వృద్ధికి పెనుముప్పు వాటిల్లింది.


మద్రాసీయులు అనధికారంగా పరిధి దాటి వేట(ఫైల్)

తనిఖీలు నామమాత్రమే

ఫిర్యాదులు చేస్తేనే అధికారులు తనిఖీలకు వస్తున్నారు గానీ, పర్యవేక్షణలోపం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వేట సంధికాలం నుంచి వేట సాగిస్తున్నా అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విమర్శలు ఉన్నాయి. ఈ విధంగా మద్రాసీయులు ఒకవైపు, అనధికార లైసెన్సీయులు మరోవైపు వేట సాగిస్తే సంపద వృద్ధి చెందక భవిష్యత్తులో వేట సాగక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని మత్స్యకారులు విలపిస్తున్నారు.

అవీఇవీ

హైవేపై కారు బోల్తా.. ఒకరు మృతి


జాతీయ రహదారిలో బోల్తా పడిన కారు

మేదరమెట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల జాతీయ రహదారిపై తిరుమల వెళ్లి వస్తున్న కారు వేగం అదుపు కాక రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా దెందులూరు మండలం కోవల్లి గ్రామానికి ఏడుగురు తిరుపతికి వెళ్లి తిరిగి వస్తూ మేదరమెట్ల ఫ్లైఓవర్ దాటాకా కారు వేగం అదుపు కాకా రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. కారులోని సుంకర నాగరాజు(21) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ పూజారా లక్ష్మణరావు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

యద్దనపూడి/మార్టూరు మే 20 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో మేడిశెట్టి సుబ్బాయమ్మ(60) అనే మహిళ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. మృతురాలికి భర్త యలమంద, ఒక కుమారుడు రాంబాబు ఉన్నారు. ఆమె భర్త, కుమారుడు, కోడలుతో కలిసి యనమదల గ్రామంలో ఒక రైస్ మిల్లును నడుపుతున్నారు. అదేవిధంగా ఉదయం మిల్లు నుంచి బయటకు వచ్చిన ఆమె కాలకృత్యాలకు ఒక ఇంటి ప్రహరీ పక్క నుంచి వెళుతూ అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా విద్యుత్ రావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. ఈ ప్రమాదంపై కుమారుడు రాంబాబు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రత్నకుమారి సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాస్తవంగా యద్దనపూడి మండలం కటావారిపాలేనికి చెందిన సుబ్బాయమ్మ కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం యనమదల గ్రామానికి వచ్చి ఒక రైస్‌మిల్లును అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో వ్యక్తి బలవన్మరణం


బాలకృష్ణ(ఫైల్)

వేటపాలెం/చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట టైలర్స్ కాలనీలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకు చెందిన బాలకృష్ణ(40) అప్పుడప్పుడు సోడా బండి నిర్వహిస్తూ ఈపూరుపాలెంలో ఓ టిఫిన్ హోటల్లో పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య ధనలక్ష్మీ ఇరువురు కుమారులు ఉన్నారు. ఇటీవల ఇతను మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలోనే అప్పుల పాలయ్యాడు. దీంతో ఇంటిని అమ్మాలని భార్యను అడగడంతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరికి పాల్పడి బలవన్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలిక మెడలో బంగారు గొలుసు అపహరణ

అద్దంకిలో ఇంటి ముందు పూలు కోస్తుండగా ఘటన

పెంపుడు కుక్క వెంబడించి కరిచినా పారిపోయిన దొంగ

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు మొక్కల పూలు కోస్తున్న బాలిక మెడలో బంగారం గొలుసు అపహరించిన సంఘటన మంగళవారం అద్దంకి పట్టణంలోని వాసవీనగర్‌లో విశ్వభారతీ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు... గునుపూడి నరేంద్ర కుమార్తె యశస్విని మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి ముందు పూలు కోస్తుండగా గుర్తుతెలియని యువకుడు స్కూటీపై వచ్చి అదే రోడ్డులో ముందుకు వెళ్లాడు. వెనువెంటనే వెనుతిరిగి వచ్చి బాలిక మెడలో సుమారు 10 గ్రాముల బంగారం గొలుసును లాక్కొని వెళ్లాడు. బాలిక కేకలు వేయటంతో ఇంటిలో ఉన్న కుక్క వచ్చి దొంగను వెంబడించి కరిచింది. అయినా తప్పించుకొని వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగ పాత నేరస్థుడుగా అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన యువకుడు వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలుస్తుంది.

రైల్వే గేటును ఢీకొన్న లారీ


గేటును పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు లారీ రైల్వే గేటును ఢీకొంది. ఈఘటన మంగళవారం ఉదయం పేరాల సమీపంలోని కారంచేడు రైల్వే గేటు వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పర్చూరు వైపు నుంచి చీరాల వస్తున్న లారీ అదుపు తప్పి గేటును ఢీకొంది. ప్రమాదంలో గేటు దెబ్బతినడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


నిరసన చేస్తున్న వివిధ సంఘాల కార్మికులు

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో భాగంగా అద్దంకిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా కార్మికులను పెంచాలని, చనిపోయిన కార్మికులకు రూ.20 వేలు మట్టి ఖర్చుల కింద ప్రభుత్వం అందజేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీదేవికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదాం, బిష్మా, శామ్యూల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండండి

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలతోపాటపాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా వర్షపు నీరు నిలువకుండా మురుగు కాలువలు శుభ్రం చేయాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని వివరించారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	33.9	26.5
కావలి	32	27
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	32	26
కందుకూరు	32	27







సౌత్‌మోపూరులో నిర్మించిన అంతర్గత రహదారి

నేడే విజయోత్సవ సభ

- సౌత్‌మోపూరుకు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఈడీ ఆదిత్య రాక
- అభివృద్ధి పనుల పరిశీలన
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' గ్రామసభలో వచ్చిన సమస్యలకు పరిష్కారం

నెల్లూరురూరల్, మే 20,(ఆంధ్రజ్యోతి): నగరానికి పశ్చిమాన 23 కి.మీ దూరంలో ఉన్న కుగ్రామం సౌత్‌మోపూరు. అంతర్గత రహదారుల్లేక ఇళ్లలోకి వర్షపునీరు చేరేది. ఇళ్లలో నుంచి మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులో ఉండేదికాదు. రక్షణగోడ లేని జడ్పీ హైస్కూల్, రోజురోజుకి ఆక్రమణలకు గురవుతున్న శ్మశానాలు... వెరసి సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ఆ గ్రామాన్ని ఆంధ్రజ్యోతి గుర్తించింది. గ్రామ సమస్యలను ప్రత్యేక కథనాల ద్వారా గత జనవరి చివరివారంలో వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆంధ్రజ్యోతి అధ్యక్షతన 'అక్షరం అండగా.. పరి ష్కారమే అజెండాగా...' గ్రామసభను నిర్వహించారు. సభలో గ్రామస్థులు ప్రస్తావించిన సమస్యలన్నిం టినీ పరిగణలోకి తీసుకున్నారు. వాటి పరిష్కారానికి ఆయన రూ. 1.22 కోట్లు మంజూరు చేయించారు. దీంతో ఆ సమస్యలన్నింటినీ గత మూడునెలల కాలంలో పరిష్కరిస్తున్నారు. కొన్ని పూర్తికాగా, మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నారు.

ఏ పనికి ఎంతెంత ?

గ్రామంలోని వివిధ కాలనీల్లో రూ. 94 లక్షలతో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రూ.16 లక్షలతో వాణీశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణగోడ నిర్మిస్తున్నారు. కనుజుల మిట్ట (ఎస్టీ కాలనీ) వద్ద రూ. 10 లక్షలతో శ్మశానానికి రక్షణగోడ నిర్మాణం పనులకు టెండర్లు పూర్తయ్యాయి. బీసీ కాలనీలో రచ్చబండపై శ్లాబుకు రూ. 2లక్షలతో బుధవారం శంకుస్థాపన జరగనున్నది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి వివిధ మార్గాల ద్వారా ఈ నిధులను సమీకరించి కేటాయింపులు జరిపారు. వారి పర్యవేక్షణతో ఫిబ్రవరిలో శంకుస్థాపన జరుపుకున్న పనులన్నీ పూర్తయ్యాయి.



నిర్మాణంలో ఉన్న జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ

పనుల పరిశీలన

గ్రామంలో రూ. 1.22 కోట్లతో జరిగిన/జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూసి, ప్రజలతో మమేకం అయ్యేందుకు బుధవారం సౌత్‌మోపూరుకి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి అదిత్య, టీడీపీ సీనియర్ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రానున్నారు. ఉదయం 11 గంటలకు గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుంటారు. అక్కడ నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలిస్తారు. 11.10 గంటలకు వాణీశ్రీ జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడను పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వేసిన సీసీరోడ్డు చూస్తారు. 11.20 గంటలకు బీసీకాలనీలో నిర్మించిన రచ్చ బండపైన రూ.2 లక్షలతో నిర్మించ తలపెట్టిన శ్లాబు పను లకు శంకుస్థాపన చేస్తారు. 11.30 గంటలకు బీసీకాలనీలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో జరిగే వియోత్సవ సభలో పాల్గొంటారు. అనంతరం ప్రజలతో కొంతసేపు ముచ్చటిస్తారు.

జిల్లా నేతలకు
మహానాడు బాధ్యతలు

- వివిధ కమిటీల్లో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇతర నాయకులు



వీపీఆర్



బీఎంఆర్

నెల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు కడపలో నిర్వహించనున్న టీడీపీ మహానాడు నిర్వహణకు వివిధ కమిటీలను ఆ పార్టీ నియమించింది. ఆ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులకు స్థానం దక్కింది. వీరంతా ఆ మూడు రోజుల పాటు మహానాడు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. సమన్వయ కమిటీలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు స్థానం దక్కింది. తీర్మానాల కమిటీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య సభ్యులుగా ఉన్నారు. భోజనాల ఏర్పాట్ల కమిటీలో ముఖ్య నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మీడియా కమిటీలో ఆక్వా కల్చర్ బోర్డు చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ఉన్నారు. ఆర్థిక వనరుల కమిటీలో మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఫొటో ప్రదర్శన కమిటీకి కన్వీనర్‌గా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యవహరించనున్నారు. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీలో మళ్లీ బీద రవిచంద్రకు స్థానం దక్కింది. రవాణా కమిటీకు మంత్రి పొంగూరు నారాయణ కన్వీనర్ కాగా, అందులో సభ్యుడిగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీకి డాక్టర్ జెడ్ శివప్రసాద్ కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా, మురళీకన్నబాబు సభ్యుడిగా ఉన్నారు. జనసమీకరణ కమిటీ కోకన్వీనర్‌గా కూడా బీద రవిచంద్ర వ్యవహరిస్తున్నారు. ఇక వాహన పార్కింగ్ కమిటీలో ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, సాంస్కృతిక కార్యక్రమాల కమిటీలో దోర్నాల హరిబాబు, ప్రతినిధుల నమోదు కమిటీలో నరాల సురేంద్ర, అలంకరణ కమిటీలో మలిశెట్టి వెంకటేశ్వర్లు సభ్యులుగా ఉన్నారు.



ఆనం రామనారాయణరెడ్డి



పొంగూరు నారాయణ



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



బీద రవిచంద్ర

కామాక్షితాయికి
పురుషామృగ వాహనసేవ



పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం, మే20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారు పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుచ్చి ఉత్సవంలో గంగా,కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమి చ్చారు. ఈసందర్భంగా అంతరాల యంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులకు ఉదయం, రాత్రి దాతల సాయంతో ఉచిత ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సర్పంచు పెంచలయ్య తదితరులు పర్యవేక్షించారు. కాగా బుధవారం రాత్రి స్వామి, అమ్మవారు సింహవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.



రాజుపాలెం వద్ద పెన్నాలో ఇసుక తవ్వకాలకు అనధికారికంగా వేసిన రోడ్డు

ఆ టెండర్ వెనుక
ఆంతర్యమేమిటో...?

- రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ అట..!
- ప్రాజెక్టు లేని చోట ఎలా చేస్తారో...?
- చర్చనీయాంశంగా జిల్లా అధికారుల తీరు
- ఒత్తిళ్లతోనే టెండర్ పిలిచినట్లు ప్రచారం
- బిడ్లకు ముగిసిన గడువు, నేడు ఓపెన్

నెల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): డీసిల్టేషన్ అంటే నదిలో ఓ ప్రాజెక్టుకు పైభాగంలో పేరుకు పోయిన పూడికను తొలగించడం.... తద్వారా ఆ ప్రాజెక్టు వద్ద నీటి నిల్వను పెంచడం ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటి వరకూ పెన్నా బ్యారేజీకి ఎగువ భాగంలో పోతిరెడ్డిపాలెం వద్ద, సంగం బ్యారేజీ పైభాగంలో సూరాయపాలెం, సంగం వద్ద జరుగుతున్న డీసిల్టేషన్ ఈ కోవలోకే వస్తుంది. ఇక్కడ పడవల ద్వారా డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే ఇసుకను బయటకు తెస్తున్నారు. అయితే తాజాగా జిల్లా అధికారులు పిలిచిన ఓ ఇసుక టెండర్ వివాదాస్పదమైంది. ఎలాంటి ప్రాజెక్టు లేని చోట, ఎటువంటి ఇసుక మేటలు లేని ప్రాంతంలో మానవశక్తి ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు టెండర్లు ఆహ్వానించడం చర్చనీయాంశమైంది. కలువాయి మండలం రాజుపాలెం వద్ద మానవశక్తి ద్వారా డీసిల్టేషన్ చేసేందుకు అధికారులు టెండర్లు పిలిచారు. ఈనెల 14 నుంచి బిడ్లు దాఖలు మొదలు కాగా మంగళవారంతో గడువు ముగిసింది. బుధవారం ఆ బిడ్లను అధికారులు ఓపెన్ చేయనున్నారు. 46 హెక్టార్లు (115 ఎకరాల్లో) డీసిల్టేషన్ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. పెన్నానదిలో ఇంత పెద్ద విస్తీర్ణంలో మానవశక్తి ద్వారా ఎలా డీసిల్టేషన్ చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.



రాజుపాలెం వద్ద నిర్వహిస్తున్న అనధికార రీచ్‌కు తాళం వేసిన అధికారులు(ఫైల్)

అనధికార రీచ్ ఏర్పాటు

రాజుపాలెం వద్ద కొన్ని నెలలుగా అనధికారికంగా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేశారు. కొందరు అక్రమార్కులు ఏకంగా పెన్నా నదిలోకి రోడ్డు వేసి భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపారు. ఇక్కడి నుంచి తిరుపతి జిల్లాతోపాటు తమిళనాడుకు ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సోమశిల జలాశయానికి దిగువన మూడు కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. ఇక్కడ భారీ గుంతలు తవ్వితే, రేపు వరదలు వచ్చినప్పుడు కోతకు గురయ్యే ప్రమాదముందని స్థానికులు అడ్డుచెప్పారు. అయినా ఇసుకాసురులు లెక్కచేయలేదు. ఈ అక్రమ తవ్వకాల వ్యవహారం పత్రికల్లో రావడంతో అధికారులు స్పందించారు. అనధికార ఇసుక రీచ్‌కు తాళం వేశారు. ఇప్పుడు అధికారికంగా ఏదో ఒక పేరుతో రాజుపాలెం వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతులు తెచ్చుకోవాలని తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే అధికారులపై ఒత్తిడి తెచ్చి మానవశక్తి డీసిల్టేషన్ పేరుతో టెండర్ పిలిపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా కాలం నుంచి రాజుపాలెం వద్ద ఇసుక రీచ్ కోసం కొందరు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అక్కడ ఫీజుబులిటి సాధ్యం కాదని అధికారులు చెబుతూ వస్తున్నట్లు తెలిసింది. అందుకే గతంలో సంగం, సూరాయపాలెం, పోతిరెడ్డిపాలెం వద్ద డీసి ల్టేషన్‌కు టెండర్లు పిలిచినా, పీకేపాడు, మినగల్లు, విరువూరు, పల్లిపాడు, ముది వర్తిపాలెం వద్ద సెమీమెకనైజ్డ్‌కు టెం డర్లు పిలిచిన సమయంలోనూ రాజుపాలెంను పరిగణలోకి తీసుకోవడం లేదని మైనింగ్ వర్గాలు చెబుతు న్నాయి. అయితే ఇప్పుడు రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్‌కు టెండర్లు పిలవగా, ఆ ప్రాంతానికి అవతవల ఒడ్డును ఉన్న పీకేపాడులో మాత్రం గతంలోనే సెమీ మెకనైజ్డ్ తవ్వకాలకు టెండర్లు పూర్తి చేసి ఉన్నారు. ఒక ఒడ్డున సెమీ మెకనైజ్డ్ పిలిచి మరో వైపు మానవ శక్తి డీసిల్టేషన్ పిలవడ మేమిటన్న ప్రశ్న ఇక్కడ తలెత్తు తోంది. ఈ నెలాఖరు తర్వాత సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లన్నీ ఎన్జీటీ నిబంధనల ప్రకారం మూతపడతాయి. సెప్టెంబరు నెలాఖరు వరకూ తెరుచుకోవు. డీసిల్టేషన్ పాయింట్లు మాత్రమే ఆపరే షన్‌లో ఉంటాయి. కాబట్టే రాజుపాలెం వద్ద మానవశక్తి డీసిల్టేషన్ అని పేరు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మాటున యంత్రాలతో తవ్వకాలు జరుపుకునేందుకు స్కెచ్ వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా దీనిపై ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా రాజుపాలెం వద్ద బ్రిడ్జి ఉండడంతో డీసిల్టేషన్‌కు టెండర్లు పిలిచామని చెప్పడం గమనార్హం. మైనింగ్ అధికారులు ఫీజుబులిటీ ఇచ్చారని, ఈ విషయాన్ని మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఆయన పేర్కొన్నారు.

సమాధానమేదీ..?

రాజుపాలెం వద్ద ఎలాంటి ఆనకట్టలు లేవు. అలాంటిది అక్కడ ఎందుకు డీసిల్టేషన్ చేస్తున్నారన్న ప్రశ్నకు ఇరిగేషన్ అధికారుల వద్ద సమాధానం లేదు. టెండర్ ప్రకటనలో సంగం బ్యారేజీ అప్‌స్ట్రీమ్‌లో డీసిల్టేషన్ అని పేర్కొన్నారు. అసలు సంగం బ్యారేజీకు, రాజుపాలెంకు సంబంధమే లేదు. అక్కడకు, ఇక్కడకు మధ్య దూరం 30 కిలో మీటర్లపైనే ఉంది. మరి రాజుపాలెం వద్ద డీసిల్టేషన్ చేయడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తోంది. మనుషుల ద్వారా ట్రాక్టర్లకు ఎక్కడైనా లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. రాజుపాలెం వద్ద కూడా నేరుగా వెళ్లి ఉచితంగా ఇసుక తెచ్చుకునే అవకాశముంది. అలాంటిది మానవశక్తి డిసిల్టేషన్‌కు ప్రత్యేకంగా టెండర్లు పిలవడమేమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

యోగాసాధనతో
ఆరోగ్యకర జీవనం

- నెలపాటు గ్రామాలు, మండలాల్లో అభ్యాసం
- హైస్కూళ్లు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగాను సాధన చేస్తే ఆరోగ్యకర జీవనం సొంతమవుతుందని కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహకాల్లో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం మెగా యోగాసాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని, యోగా సాధనతో ఎన్నో అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. నిత్యనూతనంగా, ఆరోగ్యంగా కనిపించాలంటే యోగాసాధన ఒక్కటే మార్గమని తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గత పదేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని మోదీ విశాఖకు రానున్నారని పేర్కొన్నారు. రానున్న నెలరోజుల్లో ప్రతి గ్రామ, మండల స్థాయిల్లో యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ప్రతి పాఠశాలలో, కళాశాలలో కూడా యోగా సాధనపై అవగాహన కల్పించాలని తెలిపారు.



యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ ఆనంద్



ఆసనాలు వేసిన కలెక్టర్

యోగా గురువు స్వప్న ఆధ్వర్యంలో విద్యార్థులు, వాకర్స్ క్రీడాకారులతో కలిసి కలెక్టర్ ఆనంద్ యోగాసనాలు వేశారు. ప్రాణయామం, నాడీ సాధన, భుజంగాసనం, శలభాసనం, తదితర ఆసనాలను ఆయన సునాయాశంగా చేసి అందరిని ఉత్సాహ పరిచారు. అనంతరం నయాగో ఇండియా స్కూల్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా యోగా పోటీల విజేతలకు కలెక్టర్ బహుమ తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్, సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు, నిర్వాహకులు విఘ్నేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, యోగా కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



యోగా పోటీల విజేతలతో కలెక్టర్ తదితరులు

పడుగుపాడు పంచాయతీ
కార్యదర్శి సస్పెన్షన్
- వివరాలు 8లో

నాడి పడితే ఒట్టు !

- అంతా రెఫరలే..
- వేధిస్తున్న వైద్యుల కొరత
- వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
- ప్రజలపై అదనపు భారం
- ఇదీ.. ఉదయగిరి సీహెచ్‌సీ పరిస్థితి

8 లో..

ఉదయగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 550



ఆంధ్రకేసరికి ఘన నివాళి

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆంధ్రకేసరి సేవాసమితి ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు ఆయనకు ఘన నివాళులర్పించారు. కోవూరు రోడ్డులోని హరిణి ఆసుపత్రి వద్ద ఉన్న ఆంధ్రకేసరి కాంశ్యవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందనవనం రామసుబ్బారావు, డాక్టరు తన్నీరు మల్లికార్జునరావు, నారాయణం రాధాకృష్ణమాచార్యులు, పెట్లూరి సుబ్బారావు, చక్కా వెంకటకేశవరావు, కేఎస్ వెంకటేశ్వర్లు, ఆర్‌వీ బ్రహ్మానందం, ఏవీ రావు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు!

● రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ ● వర్షం వస్తే ప్రయాణికులకు వసతి కరువు

కావలి, మే 20(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో గతంలో ఏ నిర్మాణ పనులు చేపట్టినా నాణ్యతకు మారు పేరుగా ఉండేది. పేరొందిన కాంట్రాక్టర్ల పనులు చేపట్టేవారు. అలాంటిది ఇప్పుడు రైల్వే శాఖలో పనులు నాణ్యత లోపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా పెద్దగా ఉండడంలేదనేందుకు నాణ్యతలేని పనులే నిదర్శనంగా మారాయి. కావలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా పలు నిర్మాణ పనులు చేపట్టినా వాటిలో నాణ్యతలో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు రోజులుగా కురిసిన చిన్నపాటి వర్షాలకు రైల్వే స్టేషన్‌లో మొత్తం నీరు చేరి, రేకులు ఉరుస్తుండడంతో ప్రయాణికులు నిలవడానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా 4వ నెంబరు ఫ్లాట్‌ఫారంపై ఉన్న షెడ్లు వర్షపు నీరు చుక్క పక్కకు పోకుండా షెడ్లు దోనెలో నుంచి ప్రయాణికులు కూర్చునే బల్లలపై వర్షపునీటి దారలు పడుతున్నాయి. సహజంగా ఎక్కడైనా ఒక చోట ఎదైనా ఇబ్బందుల వలన వర్షపు నీరు పడటం సహజం. కానీ రైల్వేస్టేషన్‌లో షెడ్ల కింద వేసి ఉన్న అన్ని బల్లలపై వర్షపు నీరు పడుతున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆ షెడ్లు ఎండలకు తప్ప వర్షాలకు పనికి రానట్లుగా తయారయ్యాయి. అలాగే 1వ నంబరు ప్లాట్‌ఫారంపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడతున్నారు. అదే ప్లాట్‌ఫారంపై నిర్మించిన మంచినీటి కొళాయి చుట్టూ నీరు నిలిచి అక్కడ పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు.


రైల్వేస్టేషన్‌లో బల్లలపై పడుతున్న వర్షపునీరు


కుళాయి వద్ద నీరు నిల్వతో పట్టిన పాచి

అలా గే ఫుట్‌పాత్ మెట్లలో పడిన వర్షపు నీరు వెళ్లేందుకు తగిన వాలు లేక పోవటంతో మెట్లపై వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందికరంగా మారి ఎక్క డ ప్రమాదాల జరగుతాయోనని ఆందోళన చెందుతన్నారు. అలాగే 1వ నంబరుప్లాట్‌ఫారంలో అక్కడ క్కడ పెద్ద పెద్ద రంధ్రాలు పడటంతో వాటిలో కాళ్ల తట్టుకుని ఎక్కడ పడతామోనని ప్రయాణికుల భయపడుతున్నారు. స్టేషన్ ముందు భాగాన ఉన్న ప్రదేశంలో కూడా వర్షపు నీరు పోయేందుకు తగిన వాటంలేకుండా ఉండటంతో నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్టేషన్‌కు వచ్చే మార్గంలో మధ్యలో ఒక గుంట పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించు కోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. అసలు నిర్మాణ పనులలో నాణ్యతకు పూర్తిగా తిలోదకాలు ఇవ్వటమే కాక నిర్వహణ పట్ల కూడా నిర్లక్ష్యంగా వ్యహరిస్తుండటంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి చర్యల చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

ప్రత్యేక ఆధార్ కేంద్రం పరిశీలన


సిరిపురంలో గిరిజన మహిళకు ఆధార్ కార్డు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో గిరిజనుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ కుటుంబాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న మోటారుసైకిల్ అదుపుతప్పి పడిపోవటంతో చిరుమామిళ్ల రవికుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట సమీపంలో మంగళవారం జరిగింది. గుడ్లూరు మండలం దారకానిపాడుకు చెందిన రవికుమార్ పొన్నలూరు వైపు నుంచి కందుకూరుకు మోటారుసైకిల్‌పై వేగంగా వస్తూ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలవడంతో రవికుమార్ అపస్మారక స్థితికి చేరాడు. క్షతగాత్రుడిని 108లో స్థానిక వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఒంగోలులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు.

24న లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి వచ్చే అధికారులు అజెండాలోని అంశాలపై పూర్తి సమాచారంతో ఉండాలని తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కావలిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతిలో 2024-25 విద్యా సంవత్సరంలో 470కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఎపా)ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఎపా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బూచి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు డివిజన్‌కు చెందిన అర్హులైన యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు 9492007309, 9490662651కు సంప్రదించాలని మార్కుల జాబితా వాట్సాప్ చేయాలని పేర్కొన్నారు. జూన్ 1వ తేది ఉదయం 8గంటలనుంచి గొలగమూడి రోడ్డు కొండాయపాలెం వద్ద నున్న యాదవ్ భవన్‌లో పురస్కారాలు అందిస్తారని తెలిపారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కొండాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు మండలంలోని కొమ్మిలో మంగళవారం అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ టీడీపీ యువ నాయకుడు అంబటి సురేంద్ర ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి కేకు కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యువత బీ.రవి, అంబటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఆయన అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేశారు.

రేపు హనుమాన్ శోభాయత్ర

లింగసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఈనెల 22న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని లింగసముద్రం పంచాయతీ బలిజపాలెంలోని ఆంజనేయస్వామి విగ్రహానికి అందమైన రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేశారు. అదేరోజు ఉదయం 9 గంటలకు స్వామి వారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయత్ర కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ జయంతి ఉత్సవానికి భక్తులు భారీగా హాజరై శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తాగునీటి సరఫరా, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

● సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, బోగోలు



బిట్రగుంట, మే 20(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని 16 పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా రక్షిత మంచినీరు సరఫరా చేయించడంతో పాటు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాం. అలాగే గ్రామాల్లో పరిశభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునఃప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఈ వారం ముఖాముఖి

? వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

! మండలంలో ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేదు. ఒకవేళ ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే తక్షణ చర్యలు తీసుకుని నీటి సరఫరా చేస్తాం. అలాగే పంచాయతీ కార్యాలయం, బస్టాండు, ప్రధాన కూడళ్లలో అధికారులు, దాతలు, స్వచ్ఛంద సంస్థల దారా చలివేంద్రాలు ఏర్పాటు చేశాం.

? వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టారు.

! అన్ని గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి నీటిని నిల్వ ఉండేలా చూడాలని పశువైద్యాధికాలు, సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు నిల్వ ఉండటం వలన ఎలాంటి ఇబ్బందులు లేవు.

? మండలంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

! స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి మూడవ శనివారం ప్రజలను చైతన్య పరుస్తూ ప్రత్యేక కార్యక్రమం చేస్తున్నాం. గ్రామల పరిశుభ్రత, వేసవి నుంచి ఉపశమనం పొందడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం కార్యాలయాల్లో కూల్ సున్నం వేయిస్తున్నాం. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సి జాగ్రత్తలు వివరిస్తున్నాం.

ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ తీగలు


చేతికి తగులుతున్న విద్యుత్ తీగలు

ఉలవపా డు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మనిషి చెయ్యి ఎత్తితే తగిలేంత ఎత్తులో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. వీటితో ప్రమాదం పొంచి ఉందని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలో సుమారు 150 రొయ్య లు చెరువులు సాగులో ఉన్నాయి. కరేడు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఇండస్ట్రీ ఫీడర్ 11 కేవీ హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా ఆక్వా రైతులకు కేటాయించారు. అయితే విద్యుత్ సరఫరా తీగలు సాగిపోయి కిందకు వేలాడుతు మనిషి చెయ్యి ఎత్తితే తగిలే అంత ఎత్తులో ఉండటంతో చెరువుల వద్ద రాత్రులు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికి రెండుసార్లు విద్యుత్ తీగలు తెగిపడినా సంబంధిత అధికారులు జాయింట్‌లు వేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు తప్ప హై ఓల్టేజీ తీగలు కిందకు వేలాడడాన్ని మాత్రం సరిచేయలేదు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆక్వా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని 11కేవీ విద్యుత్ తీగల నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● కార్మికుల నిరసన ర్యాలీ

కావలిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తక్షణం నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను కష్టాలపాలు చేసే కుట్ర పన్నిందన్నారు. ఇటువంటి దుర్మార్గపు లేబర్ కోడ్‌ల వలన కార్మికుల తమ హక్కుల సాధన కోసం సమ్మె చేసుకునేందుకు అవకాశం హక్కు కోల్పోతారని ఆవేదన చెందారు. కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కు, ఉద్యోగ భద్రత తదితర ప్రధాన హక్కులు కాలరాస్తుందని కనీస వేతన చట్టం రూ.26000 అమలు కాదని, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయరని, తక్కువ వేతనాలతో ఎక్కువ పని చేయించుకునే ప్రమాదముందన్నారు. ఇప్పటికే అనేక రకాల ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేట్‌వరం చేయడంతోపాటు కార్మికుల పనిభారం పెంచి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు పసుపులేటి పెంచలయ్య, మల్లి అంకయ్య, ఏఐఎఫ్‌టీయు న్యూ నాయకులు లక్ష్మారెడ్డి, కార్మిక నాయకులు శ్యామలమ్మ, కృష్ణమోహన్, దర్గాబాబు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



ట్రంకురోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న వివిధ రంగాల కార్మికులు

సీఐటీయూ నిరసన

కందుకూరు : కేంద్రప్రభుత్వం విధించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కందుకూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయం వద్ద నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు వివిధ రంగాల కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసి 4 లేబర్‌కోడ్‌లను విధించటం ద్వారా కేంద్రప్రభుత్వం కార్మికులను వీధుల పాలు చేసిందని ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోకపోతే జూలై 9న దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికుల సమ్మెతో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్, జీవీబీ కుమార్, కొట్టె వెంకయ్య, ఎస్‌డీ గౌస్, గుత్తి మల్లిఖార్జున, సుంకర విజయలక్ష్మి, సీహెచ్ ఇందిరావతి, ప్రభావతి, పవన్‌కుమార్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం


గ్రామోత్సవంలో పోలేరమ్మ

బిట్రగుంట, మే 20(ఆంధ్ర జ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ చెంచులక్ష్మీపురంలో వెలసి ఉన్న పోలేరమ్మ పొంగళ్లు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం రాత్రి ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం తెల్లవారు జామున పోలేరమ్మకు అభిషేకాలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కాయాకర్పూర హారతులు ఇచ్చి సేవించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ, పూలంగిసేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మునగాల జనార్దన్‌రెడ్డి, కడియాల వెంకయ్య, పసుపులేటి సుబ్బారావు, గుంజి వెంకటేశ్వర్లు, షేక్.బాబు, పసుపులేటి రఘు, తదితరులు పాల్గొన్నారు.

మందాటి చెరువు అభివృద్ధికి చర్యలు

● అధికారులతో కలసి ఎమ్మెల్యే పరిశీలన


మందాటి చెరువు అభివృద్ధి ప్రణాళికను ఎమ్మెల్యేకు వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ

కావలి, మే 20(ఆంధ్రజ్యోతి) : కావలి మందాటి చెరువు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, దీంతో చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, లైటింగ్, గ్రీనరీ, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మందాటి చెరువును త్వరలో సుందరంగా తీర్చిదిద్ది ఒక పర్యాటకంలా దాని రూపురేఖలు తీసుకు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన కావలి ఎమ్మెస్సార్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను మంగళవారం కావలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ మేళాలో సుమారు 23 కంపెనీలు పాల్గొని 1200 మందిని ఎంపిక చేస్తారన్నారు. ఈమేళాలో 10, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, పాలిటెక్నిక్, బీ ఫార్మసీ చేసిన నియోజకవర్గంలోని యువత పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా ఇన్‌చార్జి ఖయూమ్, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు కొత్త స్పిల్‌వే

స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటు జరిగేనా?


రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటుకు నిర్మించిన దిమ్మెలు

లింగసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులోని కొత్త స్పిల్‌వేలో రేడియల్ గేట్ల ముందు భాగంలో అధికారులు స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటును విస్మరించారు. ఈ స్పిల్‌వేలోని రేడియల్ గేట్లు ప్రాజెక్టులో నీరు ఉన్న సమయంలో మరమ్మతులకు గురైన సమయంలో గేట్ల వద్దకు నీరు రాకుండా నిలిపివేసి గేట్లను బాగు చేసేందుకు ఈ స్టాప్‌లాక్ గేట్లను నిర్మిస్తారు. రాళ్లపాడు ప్రాజెక్టుకు 1994, 96 సంవత్సరాలలో రెండుసార్లు ఒకే చోట గండ్లు పడినప్పుడు అధికారులు ఇక్కడ 5 రేడియల్ గేట్లతో కొత్త స్పిల్‌వేను నిర్మించారు. అయితే ఈ స్పిల్‌వేను నిర్మించేటప్పుడు స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు దిమ్మెలను నిర్మించారు. ఇవి నిర్మించి దాదాపు 25 ఏళ్ల గడిచినప్పటికీ అధికారులు ఈ స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటును పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భారత సైన్యానికి సెల్యూట్

అల్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత సైన్యం, వాయుసేన, నావికాదళం సత్తా చాటిన సందర్భంగా వారికి మద్దతుగా అల్లూరులో మంగళవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, హిందూ చైతన్యవేదిక, హిందూ ప్రచార పరిషత్, విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ సంఘాలు, మిత్రసంఘాలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో అల్లూరు ఇస్కపల్లి రోడ్డు నుంచి కోనేటి సెంటరు వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సేన చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమవడానికి కృషి చేసిన ప్రతి జవానుకి సెల్యూట్ అంటూ నినాదాలు చేశారు.



అల్లూరులో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న నేతలు

ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ క్యాంపు

కొండాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు ఆధార్‌కార్డులేని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంపై మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ సామాజిక వర్గంలో ఆధార్‌కార్డులు లేనివారితోపాటు కార్డు పోగొట్టుకున్నవారికి తిరిగి మంజూరు చేసేందుకు ఈనెల 30వ తేదీ నుంచి జూలై 6 వరకు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. 6 ఏళ్ల లోపు వారికి కచ్చితంగా పుట్టినతేది సర్టిఫికెట్లు ఉండాలని, 6 ఏళ్ల పైబడిన వారికి పంచాయతీ కార్యాలయంలో పుట్టినతేది సర్టిఫికెట్లు ఇచ్చేందుకు మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంపై ఎస్టీ కాలనీవాసులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, ఈవోపీఆర్‌డీ నారాయణరావు, సీడీపీవో పద్మజ, ఐటీడీఏ ఏపీఐవో మస్తాన్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణ

పురిణి చెరువు ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీవో

అల్లూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురిణి ఎల్‌పీఎం 1391లో 500 ఎకరాల చెరువు భూమిని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ మంగళవారం పరిశీలించారు. చెరువు ఆక్రమించుకొని భూములుగా మార్చి పంటలు పండించుకోవడంతో ఆ చెరువు ఆయకట్టు పరిధిలోని గోగులపల్లికి చెందిన రైతులు నీరు సరిగా సరఫరా కాకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కారణంగా కొంతమేర ఇరిగేషన్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. తాము పేద రైతులమని తాము తీవ్రంగా నష్టపోతున్నామంటూ ఆక్రమిత రైతులు సోమవారం అర్జీలు అందజేశారు. దీంతో ఆయన సదరు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమిత రైతులు, ఆయకట్టు రైతులతో మాట్లాడారు. పరిస్థితిని ఇరువర్గాలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ



రేపు హనుమజ్జయంతి

● పలు ఆలయాల్లో ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. బాలాజీనగర్ సీతారామ మందిరం ఆధ్వర్యం లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మందిరం కమిటీ తెలిపింది. అధ్యక్షుడు తన్నీరు మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు అప్పల సత్యం, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, త్యాగరాజస్వామి కళ్యాణ మండపం అధ్యక్షుడు అమరా మోహన్‌రావు మంగళవారం మందిరంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. గురువారం ఉదయం 6.30 గంటలకు పంచామృత అభిషేకాలు, 8.30 గంటలకు మన్యుసూక్త హోమం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి జరుగుతాయని చెప్పారు. 10గంటలకు ఆకుపూజ, సింధూర అర్చన, అన్నదానం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి ఒంటె వాహన సేవ జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

రాయాజీవీధిలో..

నగరంలో రాయాజీ వీధిలోని హనుమాన్ ఆలయంలో గురువారం హనుమజ్జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ భక్తమండలి ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6గంటలకు గణపతిపూజ, 6.30గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 9గంటలకు ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజ, 10గంటలకు మన్యుసూక్త హోమం, 12గంటలకు పూర్ణాహుతి, అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొంది. సాయంత్రం 6 గంటలకు చందనాలంకారం, 6.30 గంటలకు లలితా సహస్ర నామపూజ, పూలంగిసేవ, రాత్రి 7గంటలకు సీతారాములు కల్యాణం జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.



హనుమజ్జయంతి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు

నేటి నుంచి ఉత్సవాలు

నగరంలోని మూలాపేట చెమ్మండివారి తోటలోని అభయాంజనేస్వామి ఆలయంలో బుధవారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతాయని భక్తుడు మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈనెల 24వతేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

కనుల పండువగా పల్లకీసేవ

నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకీ సేవ కన్నుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకం, అర్చన, హోమం, నివేదన, హారతులు జరిగాయి. సాయంత్రం బ్యాండ్ కచేరీ, ప్రత్యేక అలంకార దర్శనం, హోమం, పల్లకీసేవ, హారతి జరిగాయి. భక్తులు భారీ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఏసీలు ఉన్నా..
చెట్టు నీడే చల్లన.. !

ఇంట్లో ఏసీ ఉన్నా.. ఊరి చివర వేపచెట్టు నీడే చల్లదనమని అనుకున్నారో.. ఏమో మండలంలోని సిద్దీపురం గ్రామంలో అనసూయనగర్‌కు వెళ్లే దారిలో ఉన్న వేపచెట్టు అరుగు వద్ద గ్రామస్థులు సేద తీరుతున్నారు. చేలల్లో పంటలు లేకపోవడంతో వేపచెట్టు కింద కబుర్లు చెప్పుకుంటూ ఎండల గ్రామస్థులు ఉపశమనం పొందుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

మాదక ద్రవ్యాల అనర్థాలను వివరించాలి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 20 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వాడకంతో కలిగే అనర్థాలను యువతకు అర్థమయ్యేలా వివరించాలని, ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో నషా ముక్త భారత్ అభియాన్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గంజాయి, పొగాకు, గుట్కా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం వల్ల కలిగే దుష్ప్రరిణామాలు, చట్టపరంగా అమలవుతున్న శిక్షలపై జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో, జనసంచారం కలిగిన ప్రదేశాలల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రించాలన్నారు. కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ మహ్మద్ అయూబ్, సూపరింటెం డెంట్ సంధ్యారాణి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్‌ఐవో వరప్రసాద్, బాలల సంరక్షణ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

చంద్రబాబుకు రేషన్ డీలర్ల పాలభిషేకం

● దుకాణాల ద్వారా సరుకుల పంపిణీపై హర్షం

నెల్లూరు (హరనాథపురం), మే 20 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకులను జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయిస్తామని పౌరసరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించ డంపై జిల్లాలోని రేషన్ డీలర్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి మనోహర్ ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు జిల్లా యునైటెడ్ చౌక ధరల దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఎంతో రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన రమేష్, ఉపాధ్యక్షుడు పాబోలు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, మీడియా ఇన్‌చార్జి ఎం రమేష్, సంయుక్త కార్యదర్శి కే సురేష్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

పడుగుపాడు పంచాయతీ
కార్యదర్శి సస్పెన్షన్

కోవూరు, మే 20(ఆంధ్రజ్యోతి): పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి వీ హజరత్‌బాబును సస్పెండ్ చేస్తూ పంచాయతీ రాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల్ని తుంగలోతొక్కి రూ.25,51,910 మేరకు అవక తవకలకు పాల్పడినట్లు నిర్ధారించి నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. పడుగుపాడు పంచాయతీ పరిధి నుంచి హజరత్‌బాబు తమ అనుమతి లేకుండా వెళ్లకూడదని సూచించారు. సస్పెన్షన్ ఉత్తర్వులు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా కార్యదర్శికి అందడంతో జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో ప్రకంపనలు ప్రారంభమయ్యాయి.

కేంద్రం నియంత్రణలోకి
ఉపాధి

● ఇక యుక్తధార యాప్ పూర్తిస్థాయి అమలులోకి
● ప్రతి పనిని నమోదు చేయాలని ఆదేశాలు
● పనులు, చెల్లింపులు అన్నీ ఇక ఢిల్లీ నుంచే..

సంగం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉపాధి హామీ పథకం పనులు సాగాయి. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని స్థాయిలోనూ తమ ఆధీనంలో ఉండేలా చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఇక నామమాత్రంగానే ఉండబోతున్నదని ఈ పథకాన్ని అమలు చేస్తున్న నీటి యాజమాన్య సంస్థ అధికారులు స్పష్టం చేశారు.

● **యాప్ రూపకల్పన**

ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా తన నియంత్రణలోకి తీసుకునేందుకు కేంద్రం యుక్తధార అనే యాప్‌ను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించేందుకు 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు కల్పించేలా చేసింది. ఏపీవో, ఎంపీడీవోలు పర్యవేక్షించేవారు. పనుల కల్పన, బిల్లుల చెల్లింపులన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొనసాగేవి. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన యుక్తధార యాప్ ద్వారా ఇప్పటి వరకు ఈ పథకంలో జరుగుతున్న ప్రాసెస్ కనుమరుగయ్యే అవకాశముంది.

● **యాప్ అమలు ఇలా...**

ఎక్కడ ఎలాంటి పనులు జరుగుతున్నాయి.. ఏ ప్రాంతంలో ఏ పని ఎప్పుడు చేయాలి. అంచనాల రూపకల్పన ఎలా.. ? బిల్లుల చెల్లింపులు తదితర అంశాలన్నింటినీ యుక్తధార యాప్ ద్వారా ఢిల్లీలో కూర్చొని కేంద్రం ప్రభుత్వ అధికారులు నిర్ణయించనున్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి అవసరమైన లేబర్ బడ్జెట్ ఆమోదం తెలుపుతుంది. కూలీలు చేయాల్సిన పనులన్నీ కేంద్రమే గుర్తిస్తుంది. వారికి నగదును నేరుగా కేంద్రమే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుంది. ఇప్పటికే అమలులో ఉన్న యుక్తధార యాప్ ఇక పూర్తిస్థాయిలో వినియోగంలో తీసుకువచ్చి కేంద్రమే పూర్తిస్థాయిలో పర్యవేక్షించనున్నది. దీని వల్ల కూలీలకు బిల్లుల జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు జమయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బురద రోడ్డుపై
ప్రయాణించేదెలా?

కలిగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): ఎండైనా, వానైనా ఆ రోడ్డుపై ప్రయాణించడమంటే నరకప్రాయమే. చినుకు పడితే చిత్తడిగా మారి అడుగుతీసి అడుగు వేయాలన్నా భయం. ఎండ కాస్తే దుమ్ము కొట్టుకు పోవాల్సిందే. ఈ పరిస్థితి ఒకరోజో.. రెండు రోజులో కాదు దశాబ్దాల తరబడి ఆ గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులు. ఇంతకీ ఆ గ్రామం ఎక్కడో మారుమూల అనుకుంటే పొరపాటే. మండల కేంద్రమైన కలిగిరికి ఏడు కిలోమీటర్లు.. కలిగిరి-కొండాపురం ప్రధాన రహదారి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న చంద్రారెడ్డిపాలెం. గ్రామంలోకి వెళ్లాలంటే నేటికీ మట్టిరోడ్డుపై నడవాల్సిందే. గ్రామం ముంగిట నుంచి కృష్ణారెడ్డిపాలెం పంచాయతీ మీదుగా రాజుపాలెం వరకు తారు రోడ్డు ఉన్నా చంద్రారెడ్డిపాలెంకి కనీసం గ్రావెల్‌రోడ్డు వేసిన దాఖలాలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే గ్రామంలోకి వెళ్లే రహదారి బురదమయంగా మారిపోతుంది. ఆ బురద రోడ్డులో ఉన్న గుంతల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గాన గ్రామ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా మహిళలు, వృద్ధులు, చిన్నారులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అలాగే గ్రామంలోని రైతులు తమ పశువులకు పచ్చిమేత తెచ్చుకోవాలంటే ఈ మార్గం గుండా నిత్యం ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సి ఉంటుంది. వర్షం వస్తే చాలు ద్విచక్ర వాహనాలకు రోడ్డుపై మట్టి అంటుకొని, చక్రాల నిండా బురద పేరుకుపోయి రహదారి మధ్యలోనే కదలలేని స్థితికి మారిపోతాయి. నాలుగుచక్రాల వాహనాలు వెళ్లాలంటే రోడ్డుపై నుంచి జారి అదుపు తప్పి పక్కన కాలువల్లోకి వెళ్లే పరిస్థితి. దీంతో వాహనదారులు హడలిపోతున్నారు. ఈ పరిస్థితిలో ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చే నేతలకు ఈ రోడ్డు గురించి మొరపెట్టుకోవడం.. వాళ్ల హామీలు ఇవ్వడం తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ఈ క్రమంలో గత ఎన్నికల సమయంలోనే కాకుండా ఇటీవల ఎమ్మెల్యేగా ఈ గ్రామానికి వచ్చిన కాకర్ల సురేష్‌కు మహిళలు రోడ్డు దుస్థితిని వివరించారు. దీంతో త్వరతిగతిన రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగిస్తామన్న ఆయన ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు.



చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారిన చంద్రారెడ్డిపాలెం మట్టిరోడ్డు

సోమశిల దక్షిణ కాలువకు నీరు విడుదల

కలువాయి, మే 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ పూర్తి ఆయకట్టు 35వేల ఎకరాలకు రెండో పంటకు సాగునీరు విడుదల చేయడం జలాశయం చరిత్రలో ఇదే తొలిసారి అని సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవచౌదరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సోమశిల అధికారులతో కలిసి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కలువాయి చెరువు నుంచి దక్షిణ కాలువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సక్రమంగా నీరందించేందుకు సాగునీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు కలసి పనిచేయాలని ఆయన కోరారు. వైసీపీ ప్రభుత్వంలో కాలువల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారని, కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపి వారి ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేస్తోందన్నారు. ఐఏబీ తీర్మానం మేరకు సోమశిల ద్వారా 3.46 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే కండలేరు ద్వారా మరో 1.65 ఎకరాలకు మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 5లక్షల ఎకరాలకు సాగునీరు రెండో పంటకు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని అన్నారు. ఈఈ మల్లికార్జున మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలోని రైతులు రెండో పంటగా ఆరుతడి పంటలు వేసుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కాలువ కమిటీ వైస్ ప్రెసిడెంట్ చల్లా విజయభాస్కర్‌రెడ్డి, నీటి సంఘాల ప్రతినిధులు మల్లు విజయకుమార్‌రెడ్డి, ఉడతా హజరత్తయ్య, రావి ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, బీజేపీ నాయకుడు దండు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కలువాయి చెరువు నుంచి నీరు విడుదల చేస్తున్న సోమశిల అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు

నాడి పడితే ఒట్టు !

● అంతా రెఫరలే.. ● వేధిస్తున్న వైద్యుల కొరత
● వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
● ప్రజలపై అదనపు భారం
● ఇదీ.. ఉదయగిరి సీహెచ్‌సీ పరిస్థితి

ఉదయగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): రూ. కోట్లు వెచ్చించి భవనం నిర్మించారు. అందంగా ఉండేందుకు రంగులు కూడా వేశారు. అందులో 50 పడకలు ఏర్పాటు చేశారు. కానీ... పేదవాడి నాడీ పట్టి చూసే వైద్యులను మాత్రం నియమించలేదు. దీంతో రూ. లక్షలాది విలువయిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. అరకొరగా ఉన్న వైద్యులపై పని భారం పడడంతోపాటు వైద్యశాలకు వచ్చే రోగులను రెఫర్ అంటూ చేతులు దులుపుకుంటున్నారు.



ఉదయగిరి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

ఇదీ ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పరిస్థితి.

● **రోగుల తాకిడి అధికం**

ఉదయగిరి సీహెచ్‌సీకి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ వైద్యశాలకు ప్రతిరోజూ 200 నుంచి 250 మంది రోగులు వస్తుంటారు. అయినా మెరుగైన వైద్యం అందడంలేదు. విధి నిర్వహణలో ఏ డాక్టర్ ఉన్నా వచ్చినా రోగిని చేయి కూడా పట్టుకోకుండా రుగ్మత తెలుసుకుని మందులు రాసిస్తున్నారు. దీనికితోడు రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో వైద్యశాలలకు వచ్చిన క్షతగాత్రులకు నామమాత్రంగా చికిత్స అందించి రెఫర్ అంటూ ఆత్మకూరు, నెల్లూరు, కావలి వైద్యశాలలకు పంపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ వైద్యంపై ప్రజలను నమ్మకం సన్నగిల్లింది. ఈ క్రమంలో అప్పులు చేసి మరీ ప్రైవేటు వైద్యశాలలకు వెళుతున్నారు.

● **వేధిస్తున్న వైద్యుల కొరత**

50 పడకల ఈ వైద్యశాలలో సుమారు 12 మంది వైద్యులు ఉండాల్సి ఉంది. అయితే ఐదుగురు వైద్యులు ఉండగా, ఒకరు లీవ్‌లో ఉన్నారు. ఉన్న నలుగురిపై పని భారం పడడంతో వారు తూతూమంత్రంగా వైద్యసేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా చిన్న పిల్లల డాక్టరు, గైనకాలజిస్టు, జనరల్ మెడిషన్, సర్జన్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో వైద్యసేవలు అందడం గగనంగా మారింది.



ఫిజియోథెరపిస్టు లేక మూలకు చేరిన సామగ్రి

నిరుపయోగంగా పరికరాలు

కొన్నేళ్ల క్రితం రూ.5 లక్షలు వెచ్చించి చిన్నారుల సంరక్షణ కేంద్రాన్ని నిర్మించారు. అప్పటి నుంచి వైద్యుడిని నియమించక పోవడంతో రూ.లక్షల విలువైన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. చిన్నారులకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తున్నది. రెండేళ్లుగా ఫిజియోథెరపిస్టు పోస్టు ఖాళీగా ఉండడంతో పరికరాలు వైద్యశాలలో మూలకు చేరాయి. అలాగే శస్త్రచికిత్స పరికరాలు, వెంటిలేటర్లు కూడా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టి వైద్యశాలలో వైద్యుల నియామకం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గొలుసులు కొంటామంటూ దోచేశారు..!

● నలుగురు మహిళల అరెస్టు
● చోరీ సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైం), మే 20 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకు వెండి గొలుసులు కొనుగోలు పేరుతో తియ్యటి మాటలు చెప్పిన మహిళలు ఏడు జతల గొలుసులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో చోరీకి పాల్పడిన నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు నెల్లూరు కోటమిట్టకు చెదిన దగ్గోలు చెంచుముని రెడ్డి ఆ చారివీధిలో మేఘన శ్రీ జ్యూయి లరీ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆ దుకాణానికి 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన ముగ్గురు మహిళలు వచ్చారు. కాళ్ళపట్టీలు(గొలుసులు) చూపించమని అడిగారు. వెండి పట్టీలను చూపిస్తుండగా మాయ మాటలు చెప్పి రూ.70 వేలు విలువ చేసే సుమారు 740 గ్రాముల బరువున్న 7 జతల పట్టీలను దోచుకెళ్లారు. మహిళలు షాపు నుంచి వెళ్లిన తర్వా త దొంగతనం జరిగినట్లు గుర్తించిన యజమాని చిన్నబజారు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు సఫలం

● డీఈవో కార్యాలయం ముట్టడి వాయిదా

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జరిపిన చర్చలు సఫలమయ్యాయని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు ఏ సురేంద్రరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, రీఅపోర్షన్‌మెంట్, ఇతర సమస్యలకు సంబంధించి ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులతో ఉపాధ్యాయ సంఘాలు భేటీ అయ్యాయని తెలిపారు. తమ డిమాండ్లకు ఉన్నతాధికారులు ఆమోదం తెలియచేయడంతో బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు.

టెన్త్ సప్లిమెంటరీకి 251 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఈ పరీక్షకు 328 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 77 మంది మాత్రమే హాజరయ్యారు. 251 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఓపెన్‌స్కూల్ టెన్త్ పరీక్షలకు 137 మంది హాజరు కావాల్సి ఉండగా 90 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరయ్యారు. డీఈవో బాలాజీరావు 6 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 22 కేంద్రాలు కలిపి మొత్తం 28 కేంద్రాలను పరిశీలించారు.

ఏపీ ఐసెట్ ఫలితాల విడుదల

● 1,634 మందికి అర్హత

నెల్లూరు(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షకు జిల్లా నుంచి 1861 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1726 మంది హాజరయ్యారు. వారిలో 1634 మంది అర్హత సాధించినట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. వీరిలో పురుషులు 725 మంది, మహిళలు 909 మంది ఉన్నారని తెలిపారు.

పాముకాటుకు గిరిజన యువకుడి మృతి

● మూఢనమ్మకానికి నిండు ప్రాణం బలి

ఉలవపాడు, మే 20(ఆంధ్రజ్యోతి) : మంత్రాలకు, తంత్రాలకు పాముకాటు నయమవుతుందన్న భ్రమలో కళ్లముందే నిండు ప్రాణం గాలిలో కలిసి పోయిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. మృతుడి బంధువులు కథనం మేరకు.. ఉలవపాడు పంచాయతీ పరిధిలోని కే రాజుపాలెం యానాది కాలనీకి చెందిన మానికల పోలయ్య (26) తన భార్యతో కలిసి ఉలవపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ మామిడి తోటలో రెండు రోజుల క్రితం కాపలాకు చేరాడు. మంగళవారం ఉదయం వర్షం పడుతుండటంతో పందిరి వేసుకొని వర్షం పడకుండా దానిపై పట్ట కప్పుకునేందుకు తోట కంచె వద్ద కర్రలు కొడుతుండగా కాలుపై ఏదో కుట్టినట్లు అనిపించింది. దానిని పరిశీలించగా తన కాళ్ల వద్ద నుంచి పాము పొదల్లోకి వెళుతూ కనిపించింది. దీంతో తన భార్యతో చెప్పి ఇద్దరు కలిసి తెట్టుకు వెళ్లి పాము కాటుకు మంత్రం వేయించారు. అప్పటికే సమయం గడిచిపోవ డంతో పరి స్థితి విషమంగా మారిందని గమనించి తెట్టు నుంచి ఆటోలో కావలి ప్రభుత్వ ఆసుపత్రికి పోలయ్యను తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు పరీక్షించిన వైద్యులు నిర్ధారించారు. పోలయ్యను పాముకాటు వేసిన తోట హైవే పక్కన ఉండటం, దీనికి తోడు అరకిలోమీటరు దూరంలో ఉలవపాడు సీహెచ్‌సీ ఉంది. పాము, తేలు కాటుకు విరుగుడు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ అమాయక గిరిజనులు మూఢనమ్మకంతో మంత్రం వేస్తే తగ్గిపోతుందని చివరికి నిండు ప్రాణం బలి చేసుకున్నారు. మృతుడు పోలయ్య భార్య నాగమణి మూడు నెలల గర్భవతి కాగా, 3 ఏళ్ల బాలుడు ఉన్నాడు.



పోలయ్య మృతదేహం